# మన జనప్రగతి

తెలుగు దినపత్రిక

నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం

సంపుటి : 6 సంచిక : 138 పేజీలు : 8 వెల : రూ.2/- ఆదివారం 14 జూన్ 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool




## ఏపీ చరిత్రలో అతిపెద్ద కుంభకోణం..

**- డీఎస్సీ అక్రమాలపై థర్డ్ పార్టీతో విచారణ జరిపించాలి : వైఎస్ జగన్**

**అమరావతి,మన జనప్రగతి జూన్ 13:**
ఏపీలో కూటమి ప్రభుత్వం చరిత్రలో ఏనాడు లేని విధంగా అతి పెద్ద కుంభ కోణానికి పాల్పడిందని వైసీపీ అధినేత, మాజీ సీఎం ఆరోపిం చారు. మెగా డీఎస్సీలో జరిగిన అక్రమాలపై థర్డ్ పార్టీ తో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శని వారం ఎక్స్‌లో ఆయన చంద్రబాబు, నారా లోకేష్ పై విమర్శ లు చేశారు. అత్యంత గోప్యంగా ఉండాల్సిన డీఎస్సీ ప్రశ్న పత్రాల తయారీ, అప్‌లోడ్ పనులను ఔట్ సోర్సింగ్ సిబ్బందికి అప్పగించి అక్రమాలకు తెర తీశారని ఆరోపించారు. 16వేల టీచర్ పోస్టుల భర్తీ కోసం చేపట్టిన డీఎస్సీ ప్రక్రియలో పార దర్శకతను కాపాడే పాత వ్యవస్థను చంద్రబాబు పూర్తిగా ధ్వం సం చేశారని దుయ్యబ ట్టారు. రాష్ట్రంలోని దర్యాప్తు సంస్థలు ప్రభుత్వ నియంత్రణలో ఉండడం వల్ల నిజనిజాలు వెలికితీ యడానికి స్వతంత్ర సంస్థ సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## కొండవీటి వాగు.. పాల వాగులపై 69 వంతెనల నిర్మాణం

- వర్షాకాలం దృష్ట్యా శరవేగంగా పనుల నిర్మాణం పూర్తికి చర్యలు
- నిర్మాణాలను పూరిశీలించిన మంత్రి నారాయణ
- జగన్ విమర్శలను మరోమారు తిప్పికొట్టిన మంత్రి



**అమరావతి,మన జనప్రగతి జూన్ 13:** అమరావతిలో కొండవీటి వాగు.. పాల వాగులపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ పరిశీలించారు. అమరావతిలో మంత్రి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడారు. అమరావతిలో 69 వంతెనల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని మంత్రి నారాయణ తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా నీటి ప్రవాహానికి ఆటంకాలు తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వంతెనల వద్ద మట్టి, తాత్కాలిక కట్టలు తొలగించాలని అధికారులకు సూచించారు. కొండవీటి వాగు, పాలవాగు, గ్రావిటీ కాలువల పనులపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని దిశానిర్దేశం చేశారు. అవసరమైతే జేసీబీలతో వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వచ్చే ఏడాది నాటికి ఎక్కువశాతం వంతెనల పనులు పూర్తి కానున్నాయని మంత్రి నారాయణ వివరించారు. ఏపీ రాజధాని అమరావతి నిర్మాణాలపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి మంత్రి నారాయణ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. అమరావతి హ్యాపీనెస్ట్ గృహాల నిర్మాణ వ్యయం కేంద్ర ప్రాజెక్టుల కంటే మిగతా2లో...

## ఆర్‌జికెటిలో ప్రవేశాలకు ఎంపిక

**- తాత్కాలిక జాబితా విడుదల చేసిన లోకేశ్**



**అమరావతి,మన జనప్రగతి జూన్ 13:**ఆంధ్రప్రదేశ్‌లోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సు 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన తాత్కాలిక ఎంపిక జాబితాను ఏపీ విద్యాశాఖ విడుదల చేసింది. ఈ మేరకు ఆన్‌లైన్‌లో ఎంపిక ఫలితాలను విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా విడుదల చేశారు. నూజివీడు, ఆర్కే వ్యాలీ, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లలో ప్రవేశాల కోసం ఎంపిక పక్రియ పూర్తి చేశారు. మొత్తం 44,104 దరఖాస్తులు అందగా, వాటిలో 4,040 మంది విద్యార్థులను తాత్కాలికంగా ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో 96.7 శాతం మంది ప్రభుత్వ పాఠశాలల మిగతా2లో...

## ఫ్రాన్స్‌లో జి-7 దేశాల సదస్సు

**విదేశీ పర్యటనకు బయల్దేరిన ప్రధాని మోడీ**




**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూన్ 13:**
భారత ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనకు బయల్దేరారు. ఫ్రాన్స్, స్లోవేకియాలలో మోదీ పర్యటిస్తారు. ఈ సందర్భంగా ఆయా దేశాలతో ద్వైపాక్షిక, వాణిజ్య, వ్యాపార సంబంధాలపై చర్చలు జరపడంతోపాటు ఫ్రాన్స్‌లో జరిగే జీ7 దేశాల సదస్సులో కడా పాల్గొంటారు. ఈ సదస్సులో వివిధ దేశాధినేతలతో సమావేశమవుతారు. ఇందుకోసం న్యూఢిల్లీ ఎయిర్‌పోర్ట్ నుంచి శనివారం ప్రధాని ప్రత్యేక విమానంలో **మిగతాది** 2లో...

## స్కూలు బస్సుల ఫిట్‌నెస్‌పై సర్వత్రా ఆందోళన

**15న తెరుచుకోనున్న పాఠశాలలు**

**వాహనాల ఫిట్‌నెస్‌పై రవాణాశాఖ మార్గదర్శకాలు జారీ**




2లో.

## అసోంలో కుప్పకూలిన వైమానికదళ విమానం

**ఐదురుగు వైమానికి సిబ్బంది మృతి?**

**గౌహతి,మన జనప్రగతి జూన్ 13:**
అస్సాంలోని జోర్హాట్ వైమానిక స్థావరంలో విమాన ప్రమాదం చోటుచేసుకుంది. భారత వైమానిక దళానికి చెందిన ఏఎన్-32 రవాణా విమానం ఎయిర్‌బేస్ లోపల ల్యాండ్ అవుతుండగా, మంటలు చెలరేగడంతో కూలిపోయింది. ఈ ఘటనలో వాయుసేనకు చెందిన ఐదుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని ఐఏఎఫ్ అధికారులు వెల్లడించారు. తీవ్రంగా గాయపడిన కో-పైలట్‌కు ఆసుపత్రిలో **మిగతాది** 2లో...



## కొత్త ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్



**జూన్ 30న బాధ్యతల స్వీకరణ**

**ఉపేంద్ర ద్వివేది అదే రోజు రిటైర్**

**సైన్యం ఆధునికీకరణలో కీలక పాత్ర**

**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూన్ 13:**

భారత సైన్యానికి కొత్త ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆయన వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జూన్ 30న కొత్త ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. **మిగతాది** 2లో...

## మద్యంలో వేల కోట్ల కుంభకోణం

- అడ్డంగా దొరికిన జగన్ అండ్ కో
- అభివృద్ధిని అడ్డుకుంటూ డైవర్షన్ పాలిటిక్స్
- తీవ్రంగా విమర్శలు గుప్పించిన మంత్రి కొల్లు రవీంద్ర



**అమరావతి,మన జనప్రగతి జూన్ 13:** మద్యంలో రూ.వేల కోట్ల కుంభకోణం చేసి జగన్ అండ్ కో అడ్డంగా దొరికిందని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. గొడ్డలి పోటు, వెన్నుపోట్లకు జగన్ బ్రాండ్ అంబాసిడర్ అని వ్యాఖ్యానించారు. పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 'జగన్ లాంటి వారు ఆంధ్రప్రదేశ్‌లో ఉండకూడదనే 11 సీట్లు ఇచ్చి కూర్చోబెట్టారు. సెంటు స్థలం పేరుతోనూ వేల కోట్ల స్కామ్ చేశారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టాలని

మిగతా2లో...




## బిజెపి కుట్రలకు మీనాక్షి బలి

**ఎలాంటి కేసు లేకున్నా నామినేషన్ తిరస్కరణ**

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శ**

**హైదరాబాద్,మన జనప్రగతి జూన్ 13:**
మీనాక్షి నటరాజన్ విషయంలో బీజేపీ తీరు చూస్తుంటే ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా? లేక నియంత దేశంలో ఉన్నామా? అనే అనుమానం కలుగుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో **మిగతాది** 2లో...

## రెండేళ్లలో ఆరోగ్యశాఖలో గణనీయమైన ప్రగతి

**పేదల చెంతకు వైద్యారోగ్య సేవలు**

**ప్రభుత్వాసుపత్రుల్లో పెరిగిన రోగుల సంఖ్య**

**వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడి**

**విజయవాడ,మన జనప్రగతి జూన్ 13:**
అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి, అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అందిస్తోందని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. రెండేళ్లలో ఆరోగ్య శాఖ పరంగా చేసిన అభివృద్ధి, ప్రణాళికలను ప్రజలకు చెబుతున్నామని తెలిపారు. అన్ని వర్గాలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. శనివారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. నేడు ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. మంచి సేవలు అందుతున్నాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఇది తాము చెబుతున్న మాటలు కాదని.. గణాంకాలే తమ పని తీరును చెబుతున్నాయని **మిగతాది** 2లో...



మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం
14 - 06 - 2026


# మద్యంలో వేల కోట్ల కుంభకోణం

(మొదటి పేజీ తరువాయి)

గొడ్డలి పార్టీ కుట్ర చేస్తోంది. వాటిని దీటుగా ఎదుర్కొంటాం. గొడ్డలి పార్టీని ప్రజలు భూస్థాపితం చేసే రోజు దగ్గరలోనే ఉంది. కూటమి రెండేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశాం అని అన్నారు. గత ప్రభుత్వంలో కల్తీ మద్యం కేసు తాడేపల్లి ప్యాలెస్ గేటును తాకిందని మంత్రి ఆరోపించారు. గొడ్డలి పార్టీ నుంచి రోజుకో కుంభకోణం వెలుగులోకి వస్తోంది. చిత్తూరు నుంచి శ్రీకాకుళం వరకు ఆ పార్టీ నాయకులు అరాచకాలు సృష్టిస్తున్నారు. రాష్ట్రంలో గొడ్డలి పార్టీ శాశ్వతంగా కనుమరుగు కానుందని వ్యాఖ్యానించారు. మద్య నిషేధ హామీని తుంగలో తొక్కి, కల్తీ మద్యంతో 30 వేల మంది ప్రాణాలను గొడ్డలి పార్టీ బలితీసుకుందని ధ్వజమెత్తారు. శనివారం అమరావతి వేదికగా కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడారు. బాబాయి హంతకులను కాపాడుతూ, న్యాయం కోరిన సొంత చెల్లికే జగన్ వెన్నుపోటు పొడిచారని ఆగ్రహించారు. విద్యుత్ ఛార్జీలను 9 సార్లు పెంచి, ప్రజలపై రూ.32 వేల కోట్ల మోయలేని భారం మోపారని దుయ్యబట్టారు. మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ హామీలను అటకెక్కించి ఐదేళ్లలో 4,100 మంది నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారణమయ్యారని విమర్శించారు. జీఓ నంబర్ – 117 తీసుకువచ్చి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ప్రభుత్వ స్కూళ్లను మూసివేసి, 12 లక్షల మంది భవితను అంధకారం చేశారని దుయ్యబట్టారు. బీసీల స్థానిక సంస్థల రిజర్వేషన్లను 34శాతం నుంచి 24శాతానికి కుదించి వెనుకబడిన వర్గాలకు తీవ్ర అన్యాయం చేసిన ఘనత జగన్‌దేనని ఎద్దేవా చేశారు. పోలవరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసి రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీశారని ఆగ్రహించారు. 2024 ఎన్నికల్లో 94 శాతం స్థానాలతో కూటమికి చరిత్రాత్మక విజయం అందించి.. జగన్ అరాచక పాలనకు ఏపీ ప్రజలు స్వస్తి పలికారని ప్రస్తావించారు. గత ఐదేళ్ల విధ్వంసాన్ని తుడిచేస్తూ.. రెండేళ్ల కూటమి పాలనలో రాష్ట్రంలో అద్భుతమైన సంక్షేమం, ప్రగతి పథంలో ప్రయాణిస్తోందని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వ సానుకూల విధానాల వల్ల, రెండేళ్లలో దేశానికి వచ్చిన మొత్తం విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే దక్కాయని వివరించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 65 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నామని తెలిపారు. రెండేళ్లలో తమ ప్రభుత్వంలో రూ. 65 వేల కోట్లని నేరుగా పేదలకు పంపిణీ చేశామని వెల్లడించారు. కూటమి ప్రభుత్వ తొలి సంతకంతో మెగా డీఎస్సీ ÷లుపై ఆమోదం పొందిన తర్వాత.. 16,430 ఉపాధ్యాయ, 6,000 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ చేశామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. మెగా డీఎస్సీపై గొడ్డలి పార్టీ కుట్రలు చేస్తోందని ధ్వజమెత్తారు. ఉచిత బస్సు ప్రయాణ పథకం (స్త్రీ శక్తి) ద్వారా ఇప్పటివరకు 71 కోట్ల మంది మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని వెల్లడించారు. దీపం–2 పథకం కింద 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ.. ఇప్పటివరకు 4.26 కోట్ల సిలిండర్లను విజయవంతంగా అందజేశామని అన్నారు. 24 నెలల స్వల్ప వ్యవధిలోనే రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని వివరించారు. 21 లక్షల ఉద్యోగాల కల్పనకు పక్కా ప్రణాళిక చేస్తున్నామని తెలిపారు. జగన్ హయాంలో 85శాతం హామీలను తుంగలో తొక్కితే.. కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే 90శాతం సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చిందని ఉద్ఘాటించారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఏపీ అభివృద్ధిని గొడ్డలి పార్టీ అడ్డుకుంటోందని ధ్వజమెత్తారు. గొడ్డలిపార్టీ దొంగనాటకాలు ఆడుతూ మరొకసారి ప్రజలను మోసం చేయాలని చూస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# తుని చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసు

## • కీలకంగా భావిస్తున్న పెంపుడు కుక్క మృతి



**కాకినాడ,మన జనప్రగతి జూన్ 13:** తుని చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసులో కీలకంగా భావిస్తున్న పెంపుడు కుక్క అనుమానాస్పదంగా మృతిచెందింది. ఈ ఘటనతో కేసు దర్యాప్తులో కొత్త అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 6వ తేదీన చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యమైన సమయంలో ఆమె వెంట వెళ్లిన పెంపుడు కుక్క కూడా కొంతకాలం కనిపించకుండా పోయింది. మూడు రోజుల తర్వాత కుక్క తిరిగి ఇంటికి వచ్చింది. ఆ తర్వాత నుంచి అది విచిత్రంగా ప్రవర్తించడంతో కుటుంబ సభ్యులు, పోలీసులు దాన్ని పర్యవేక్షణలో ఉంచారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు ఆ కుక్కకు జీపీఎస్ ట్రాకర్ అమర్చారు. దాని కదలికలను నిన్న ప్రత్యేకంగా పరిశీలించారు. చిన్నారి అదృశ్యం కేసులో ఆ కుక్క కీలక ఆధారాలు ఇవ్వవచ్చని భావించారు. ఈ నేపథ్యంలో డాగ్ ప్రవర్తనపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. అయితే, గత రెండు రోజులుగా కుక్క ఆరోగ్యం క్షీణించడంతో వెటర్నరీ వైద్యులు చికిత్స అందించారు. గతరాత్రి కుక్కకు ఇంజెక్షన్ ఇచ్చిన తర్వాత, ఈరోజు ఉదయం అనారోగ్యంతో మృతిచెందింది. ఈ అనూహ్య ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చిన్నారి అదృశ్యం కేసులో పెంపుడు కుక్క మృతి కారణంగా కీలక ఆధారం కోల్పోయినట్లయింది. ఇప్పటి వరకు ఆ కుక్క కదలికల ద్వారా కొంత సమాచారం లభించవచ్చని పోలీసులు ఆశించారు. చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. చిన్నారిని ఎవరైనా అపహరించారా అనే కోణంలో కూడా విచారణ చేస్తున్నారు. కుటుంబ సభ్యులు, స్థానికులు, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు ఈ కేసును అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. ఈ ఘటనతో తుని, కాకినాడ ప్రాంతాల్లో ఆందోళన నెలకొంది.

# రెండేళ్లలో ఆరోగ్యశాఖలో గణనీయమైన ప్రగతి

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. తిరుపతిలో జరిగిన బహిరంగ సభలో ఇదే విషయాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పారన్నారు. ఓపీ సేవల నుంచి వైద్య సేవల వరకు అన్నింటిలో సరికొత్త మార్పులు తెచ్చామని తెలిపారు. ఎవరు ఆస్పత్రికి వచ్చినా ఆ రికార్డును డిజిటల్ చేశామన్నారు. రెండేళ్లలో హెల్త్ సెక్టార్‌లో గణనీయమైన మార్పులు తెచ్చామని మంత్రి తెలిపారు. ప్రజలు ఈ సేవల ద్వారా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని గొప్పగా చెబుతున్నామన్నారు. ఇందుకు సహకారం అందజేసిన అధికారులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఆరోగ్య శాఖలో కిందిస్థాయి నుంచి పై స్థాయి వరకు పని చేస్తున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నేడు ప్రజల్లో సంతృప్తికరమైన వాతావరణం నెలకొల్పామన్నారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా ఆరోగ్యాంధ్రప్రదేశ్ కీలక భూమిక పోషిస్తోందని తెలిపారు. తమకు అన్ని విధాలా సహకారం అందిస్తున్న సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఏపీలో బాధ్యతతో మెలిగే ప్రతిపక్షం లేదని.. గత ఐదేళ్ల కాలంలో జగన్ ఆరోగ్య శాఖను అనారోగ్య శాఖగా మార్చారని విమర్శించారు. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేయడం వల్ల తాము చాలా సమర్థనీయంగా పని చేశామన్నారు. తమకు ఛాలెంజింగ్ పని అప్పగించిన జగన్‌కు కూడా ధన్యవాదాలు అని అన్నారు. ÷ళిదు ఆరోగ్య శాఖలో అనేక సంస్కరణలను సీఎం చంద్రబాబు తీసుకువచ్చారని మంత్రి తెలిపారు. రియాక్టివ్, క్యూరేటివ్ స్థాయి నుంచి ప్రిడెక్టివ్ విధానాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రజల వద్దకే వెళ్లి 45 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేయిస్తున్నామన్నారు. ముందుగానే వారి సమస్యలను గుర్తించి అవసరమైన మందులు అందిస్తున్నామని తెలిపారు. టెలిమెడిసిన్ ద్వారా ప్రజలకు ఉన్న సందేహాలను వైద్యుల ద్వారా సమాధానాలు ఇప్పిస్తున్నామని చెప్పారు. మీడియా కూడా తమ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. ఎక్కడా ఎటువంటి సమస్య ఉన్నా... తమ దృష్టికి తెచ్చి పరిష్కారం అయ్యేలా చేశారన్నారు.

----------------

# స్కూలు బస్సుల ఫిట్‌నెస్‌పై సర్వత్రా ఆందోళన

**15న తెరుచుకోనున్న పాఠశాలలు**

**వాహనాల ఫిట్‌నెస్‌పై రవాణాశాఖ మార్గదర్శకాలు జారీ**

**హైదరాబాద్,మన జనప్రగతి జూన్ 13:** ఈ నెల 15 నుంచి స్కూళ్లు తెరుచుకోనున్నాయి. కొత్త విద్యాసంవత్సరం మరికొద్ది రోజుల్లో ప్రారంభం కాబోతోంది. జూన్ 12 నుంచే ప్రారంభం కావాల్సిన స్కూళ్లు ఎండల కారణంతో 15 నుంచి తెరచుకోనున్నాయి. ప్రైవేట్ స్కూళ్ల బస్సుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఫిట్‌నెస్ లేకుండా బస్సులు తిప్పితే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలున్నాయని వాపోతున్నారు. దీంతో విద్యాసంస్థల వాహనాలకు ఫిట్‌నెస్ తప్పనిసరి అని రవాణా శాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్ పేరొన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఫిట్‌నెస్ లేని, విద్యార్థులను లెక్కకుమించి ఎక్కించుకుని నడుపుతున్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వెహికల్స్‌కు పర్మిట్, ఇన్సూరెన్స్, కాలుష్య నియంత్రణ సర్టిఫికెట్ తప్పనిసరి అని తెలిపారు. డ్రైవర్లు లైసెన్స్ లేకుండా, ఓవర్ లోడ్‌తో వాహనాలు నడిపితే వెంటనే సీజ్ చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా 25,987 విద్యా సంస్థల బస్సులు ఉండగా 22,158 బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాయని, మిగిలిన 3,829 బస్సులు వెంటనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలని చంద్రశేఖర్ గౌడ్ సూచించారు. ప్రైవేట్ స్కూళ్లు, కళాశాల యాజమాన్యాలు ఫీజులపై ఉన్న శ్రద్ధ, బస్సుల ఫిట్‌నెస్‌పై కూడా ఉండాలని పేర్కొంటున్నారు. ఏ చిన్న పొరపాటు జరిగినా ప్రమాదానికి దారి తీసే అవకాశముందని వాపోతున్నారు. స్కూల్ బస్సుకు పాఠశాల పేరు, ఫోన్ నెంబర్, చిరునామా, బస్సు ఎడమ వైపు పూర్తిగా కనిపించేలా ఉండాలి. వాహనాలు తప్పనిసరిగా పూర్తి కండీషన్‌లో ఉండాలని అధికారులు పేర్కొన్నారు. బస్సు, వ్యాన్‌కు రెండు వైపులా మిర్రర్స్ ఉండాలని, డ్రైవర్ వయస్సు 60ఏళ్లకు మించరాదని పేర్కొంటున్నారు. తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, డ్రైవర్లు మూడు నెలలకోసారి షుగర్, బీపీ, గుండె పరీక్షలు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అలాగే, ప్రతీ బస్సుకు ఒక అటెండర్ ఉండా లని, బస్సులో అగ్నిప్రమాద నివారణ పరికరాలు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ ఫస్ట్ ఎయిడ్ కిట్, అగ్నిమాపక యంత్రం తప్పనిసరిగా వెల్లడిస్తున్నారు. విద్యార్థులను తీసుకొచ్చే వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలి. పాఠశాల ఉన్న ప్రాంతంలో రహదారిపై స్కూల్ జోన్ సైన్ బోర్డులు, రహదారి పై ప్రత్యేక రంగులు వేయించాలి. విద్యార్థులున్నారనే సంకేతాన్ని వాహనాల డ్రైవర్లు దూరం నుంచే గుర్తించేలా పిల్లల ఛాయాచిత్రాలతో బోర్డులు ఏర్పాటు చేయాలి. తరగతుల ప్రారంభం, ముగింపు సమయాల్లో రహదారిపై గేటు వద్ద రద్దీ సమస్య లేకుండా చూడాలి. పిల్లలు, వారి తల్లిదండ్రులు రోడ్డు దాటేలా జీబ్రా క్రాసింగ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. స్కూల్ బస్సులపై స్పెషల్ డ్రైవ్ నిర్వ హిస్తాం అని తెలిపారు. ఫిట్‌నెస్ లేకుండా తిరిగే స్కూల్ బస్సుల యాజమా న్యాలపై కఠినచర్యలు తీసుకుంటాం. ప్రైవేటు పాఠశాలల బస్సులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. భద్రతా ప్రమాణాలు పాటి స్తూ పాఠశాలల బస్సులు నడపాలి. అనుభవం ఉన్న డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలి. తల్లిదండ్రులు కూడా బస్సుల స్థితిపై ఫీడ్‌బ్యాక్ తీసుకొని పాఠశాలల యాజమాన్యాలకు రిమార్కులు తెలియజేయాలి. ప్రమాదా లు జరుగకుండా పాఠశాల యాజమాన్యాలు, డ్రైవర్లు, తల్లిదండ్రు లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# కొత్త ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అదే రోజు పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ధీరజ్ సేథ్ భారత సైన్యానికి తదుపరి అధిపతిగా బాధ్యతలు చేపట్టనున్నారు. సేథ్ నేషనల్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొందారు. 1986 డిసెంబర్‌లో ఆర్మర్డ్ కార్ప్స్‌లో అధికారిగా సైన్యంలో చేరారు. దాదాపు 40 ఏళ్లకు పైగా సాగిన సైనిక జీవితంలో కీలక బాధ్యతలు నిర్వహించారు.ఎడారి ప్రాంతాల్లో ఆర్మర్డ్ రెజిమెంట్‌కు నాయకత్వం వహించిన ధీరజ్ సేథ్, పశ్చిమ సరిహద్దు ప్రాంతంలో ఆర్మ్‌డ్ బ్రిగేడ్‌కు కమాండర్‌గా పనిచేశారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలను పర్యవేక్షించే దళాలకు కూడా నాయకత్వం అందించారు. లెఫ్టినెంట్ జనరల్ హోదాలో భారత సైన్యంలో అత్యంత కీలకమైన స్ట్రైక్ ఫార్మేషన్లలో ఒకటైన సుదర్శన్ చక్ర కార్ప్స్‌కు కమాండర్‌గా వ్యవహరించారు. ఢిల్లీ ప్రాంత జనరల్ ఆఫీసర్ ఇన్ కమాండింగ్‌గా కూడా పనిచేశారు. ఈ సమయంలో దేశీయ, అంతర్జాతీయ సైనిక కార్యక్రమాల సమన్వయం బాధ్యతలు నిర్వర్తించారు.సైన్యాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో ధీరజ్ సేథ్ కీలక పాత్ర పోషించారు. సైనిక సామర్థ్యాల పెంపు, భవిష్యత్ వ్యూహాల రూపకల్పన, దళాల పునర్వ్యవస్థీకరణ వంటి అంశాల్లో ఆయన సేవలు విశేష గుర్తింపు పొందాయి. ధీరజ్ సేథ్ హయ్యర్ కమాండ్ కోర్స్, నేషనల్ డిఫెన్స్ కాలేజ్‌లో ఉన్నత శిక్షణ పొందారు. ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్‌లో నిర్వహించే ప్రతిష్ఠాత్మక కమాండ్ అండ్ స్టాఫ్ కోర్స్‌లో కూడా పాల్గొన్నారు. సమకాలీన సైనిక వ్యూహాలపై ఆయనకు విస్తృత అవగాహన ఉందని అధికారులు చెబుతున్నారు.

# ఫ్రాన్స్‌లో జి-7 దేశాల సదస్సు

(మొదటి పేజీ తరువాయి)

బయల్దేరి వెళ్లారు. 1993 తర్వాత భారత ప్రధాని స్లోవేకియాలో పర్యటించనుండటం ఇదే మొదటిసారి. 14, 15 తేదీల్లో మోదీ స్లోవేకియాలో పర్యటిస్తారు. అక్కడి అధ్యక్షుడు పీటర్ పల్లెగ్రినితోపాటు ప్రధాని రాబర్ట్ ఫికోతో సమావేశమవుతారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించి, పలు ఒప్పందాలు కుదుర్చుకుంటారు. అనంతరం ఫ్రాన్స్ చేరుకుంటారు. 16, 17 తేదీల్లో ఫ్రాన్స్‌లోని ఈవియన్‌లో ఉంటారు. అక్కడ జరిగే జీ7 దేశాల సదస్సుకు హాజరవుతారు. ఈ సదస్సుకు విదేశీ నేతలు, ప్రతినిధులు హాజరవుతారు. వారితో దక్షిణాది ప్రపంచం గురించి చర్చిస్తామని మోదీ తెలిపారు. అనంతరం 18వ తేదీన ఫ్రాన్స్‌లోని ప్యారిస్‌లో జరిగే వివాటెక్ 2026 సదస్సులో పాల్గొంటారు.

# బిజెపి కుట్రలకు మీనాక్షి బలి

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మాట్లాడుతూ.. మీనాక్షి నటరాజన్‌పై కేసు ఏమీ లేదని.. నోటీసు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. రాజ్యసభలో బలం పెంచుకోవాలని బిజెపి కుట్రకు పూనుకున్నదని ఆరోపించారు. గాంధేయవాది, నిజాయతీకి నిలువుటద్దం మీనాక్షి నటరాజన్ అని పీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. ప్రధానమంత్రి ఆఫీసు కల్పించుకుని కేసును తప్పుదోవ పట్టించిందని ఆరోపించారు. ఈ విషయంలో ఉరి వేసినా తప్పులేదన్నారు. ప్రధాని నియంతలా వ్యవహరించడం శోచనీయమన్నారు. సుప్రీంకోర్టులో కూడా న్యాయం జరగలేదన్నారు. బీజేపీ ఫాసిస్టు విధానాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. మీనాక్షి తనకు సోదరి లాంటివారన్నారు. 24 గంటల్లో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా స్పందించకపోవడం విచారకరమని తెలిపారు. మీనాక్షిని బలి చేశారని.. ఆమె విషయంలో కొంతమంది బీజేపీ నేతలు సానుభూతి తెలిపినట్లు తెలిసిందని మహేశ్ అన్నారు. బీజేపీ నేతలు దిగజారి ప్రవర్తిస్తున్నారని విమర్శలు గుప్పించారు. లీకు వీరులు.. గ్రీకు వీరులు ఉంటే సీఎం సమగ్రంగా విచారిస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కి తమపై బురద జల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో విభేదాలు సహజమని... అంత మాత్రాన కుట్రకు పాల్పడరన్నారు. ఓటు చోరీ చేసి.. ఇప్పుడు సీటు చోరీ చేశారంటూ వ్యాఖ్యానించారు. ప్రధాని ఇంతలా దిగజారి ప్రవర్తించడం బాధాకరమని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# అసోంలో కుప్పకూలిన వైమానికదళ విమానం

(మొదటి పేజీ తరువాయి)

చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు అత్యున్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఏఎన్–32 జెట్ దృఢమైన, రెండు ఇంజన్లు గల టర్బోప్రాప్ సైనిక రవాణా విమానం. తీవ్రమైన వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా దీనిని రూపొందించారు. ఇది ఎత్తైన ప్రదేశాలలోని ఎయిర్‌ఫీల్డ్‌లలో, వేడి ఉష్ణమండల వాతావరణాల్లోనూ సమర్థంగా పనిచేస్తుంది. 7.5 టన్నుల సరకును, 50 మంది ప్రయాణికులను, 42 మంది పారాట్రూపర్‌లను రవాణా చేయగలదు. ప్రకృతి విపత్తుల సమయంలో మారుమూల ప్రాంతాలలో సామగ్రిని జారవిడవడానికి ఈ విమానాన్ని విస్తృతంగా ఉపయోగిస్తారు.

# ఆర్‌జికెలో ప్రవేశాలకు ఎంపిక

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులే ఉండటం విశేషం. గ్రామీణ ప్రతిభకు పెద్దపీట వేస్తూ ప్రవేశాలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థుల ఎంపిక లేఖలు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. అలాగే విద్యార్థుల సహాయం కోసం వాట్సాప్ హెల్ప్‌డెస్క్ నంబర్ – 9552300009ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. విద్యా రంగంలో సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పని చేస్తోందని, గ్రామీణ విద్యార్థుల సాధికారతకు ఈ ప్రవేశాలు దోహదపడతాయని ఏపీ విద్యాశాఖ అధికారులు తెలిపింది.

# కొండవీటి వాగు.. పాల వాగులపై 69 వంతెనల నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

తక్కువని స్పష్టం చేశారు. హ్యాపీనెస్ట్ గృహాల నిర్మాణ వ్యయం చదరపు అడుగుకు రూ.3,393 మాత్రమే ఖర్చు అవుతోందని వివరించారు. కేంద్ర నివాస సముదాయాల వ్యయం చదరపు అడుగుకు రూ.3,945 ఖర్చు చేస్తున్నట్లు మంత్రి నారాయణ వివరించారు. గెజిటెడ్ అధికారుల నివాసాల కోసం రూ.1003 కోట్లతో టెండర్ వేయగా చదరపు అడుగుకు రూ.3,684 మాత్రమే ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. సెంట్రల్ గవర్నమెంట్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌కి రూ.1234 కోట్లతో టెండర్ వేయగా, చదరపు అడుగుకు రూ3,945 ఖర్చు చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. రాజధాని అభివృద్ధిలో భాగంగా సీఆర్డీఏ ఆధ్వర్యంలో వాగులపై 43 వంతెనలు, ఎల్పీఎస్ లేఅవుట్లలో మరో 26 వంతెనలు నిర్మాణంలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వివరాలు తెలుసుకున్న తర్వాత అయినా ప్రతిపక్ష నేత అమరావతి నిర్మాణాలపై అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. రాజధాని అమరావతి పరిధిలోని కొండవీటి వాగు, పాలవాగులపై మొత్తం 69 బ్రిడ్జిల నిర్మాణం జరుగుతోందని మంత్రి నారాయణ తెలిపారు. ఈ రెండు వాగులపై జరుగుతున్న వంతెనల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అమరావతిలో ఎక్కడా నీటి నిల్వలు లేకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ రెండు వాగులపై మొత్తం 69 బ్రిడ్జిల నిర్మాణం జరుగుతోందని, వర్షపు నీరు సాఫీగా సాగిపోయేలా ఇంజనీరింగ్ ప్రణాళికలతో పనులు వేగవంతం చేశామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అమరావతిలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి కేంద్ర క్యాబినెట్ ఇప్పటికే ఆమోదం తెలిపిందన్నారు. అమరావతి భవనాల నిర్మాణ వ్యయంపై వైసిపి నేతలు చేస్తున్న ఆరోపణలను మంత్రి తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి చదరపు అడుగుకు రూ. 3,945 ఖర్చు అవుతుంటే, అమరావతి హ్యాపీనెస్ట్ నిర్మాణానికి రూ. 3,393, గెజిటెడ్ అధికారుల నివాసాలకు రూ. 3,684 మాత్రమే వ్యయం అవుతోందని తెలిపారు. ఐకానిక్ భవనాలు కావడం వల్లే కొన్నింటికి కొద్దిగా ఖర్చు ఎక్కువ అవుతుందని, పార్లమెంట్ భవనానికైనా, తెలంగాణ సచివాలయం నిర్మాణానికైనా తొలిసారి పిలిచిన టెండర్లుకి.. పూర్తయ్యేనాటికి భారీగా ఖర్చయిందని.. ఖర్చు పెరగడం సహజమేనని పేర్కొన్నారు.

# భారతీయ సంస్కృతికి ప్రతీక యోగా

**● శారీరక,మానసిక ఆరోగ్యం మెరుగుపరచడంలో యోగాది కీలకపాత్ర: జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్**




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూన్ 13:–** యోగా భారతీయ సంస్కృతికి ప్రతీక అని, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ తెలిపారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "యోగాంధ్ర" కార్యక్రమంలో భాగంగా నగరంలోని ఇండోర్ స్టేడియం వద్ద నిర్వహిస్తున్న పర్యాటక యోగ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ యోగా ద్వారా ఒత్తిడి తగ్గి, ఏకాగ్రత పెరగడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవచ్చని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ శారీరక, మానసిక ఆరోగ్యాభివృద్ధి కోసం యోగాను స్వచ్ఛందంగా అలవాటు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలందరూ యోగాంధ్రలో నమోదు చేసుకుని జూన్ 21న నిర్వహించే మెగా యోగా కార్యక్రమంలో పాల్గొనాలని జాయింట్ కలెక్టర్ కోరారు. రోజుకు కనీసం 10 నిమిషాల పాటు ప్రాణాయామం చేసినా ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని జాయింట్ కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, సెట్కూర్ సీఈవో వేణుగోపాల్, టూరిజం అధికారి లక్ష్మీ నారాయణ, జిల్లా లేప్రసీ అధికారి డా. భాస్కర్ రాజు, డిఈఓ సుధాకర్, మెప్మా పిడి శ్రీనివాసులు, డిఎస్డిఓ భూపతి రావు, యోగంధ్ర ఆయుష్ జిల్లా నోడల్ అధికారి డా. అమర్నాథ్, ఆయుష్ మెడికల్ అధికారి చంద్రిక, సీనియర్ వైద్యులు డా. కే. వి.ఎన్ ప్రసాద్, రాష్ట్ర యోగ సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్, జిల్లా యోగ సంఘం ప్రధాన కార్యదర్శి మునిస్వామి, నేషనల్ యోగ జడ్జి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు అల్పాహారం పంపిణీ చేసిన ఏఐఎంఐఎం నాయకులు



**ఆదోని మన జనప్రగతి జూన్ 13:–**మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఏఐఎంఐఎం నాయకులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. శనివారం ఆదోని పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ జునైద్ ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి బంధువులకు అల్పాహారంగా పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ జునైద్ మాట్లాడుతూ, సమాజ సేవే లక్ష్యంగా ప్రతి వారం ఏదో ఒక సేవా కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అవసరంలో ఉన్న వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎంఐఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొని రోగులకు అల్పాహారం అందజేశారు. రోగులు, వారి కుటుంబ సభ్యులు నాయకుల సేవా కార్యక్రమాన్ని అభినందించారు.

# ఓటర్ల మార్పులు చేర్పులపై బి.ఎల్.ఓలకు అన్ని పార్టీల వారు సహకరించాలి



**చెన్నూరు మన జనప్రగతి జూన్ 13:–**ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులకు అన్ని పార్టీ రాజకీయ నాయకులు బి ఎల్ వో లకు సహకరించాలని చెన్నూరు మండల తాసిల్దార్ విజయ కుమారి కోరారు. చెన్నూరు తాసిల్దార్ కార్యాలయంలో శనివారం అన్ని రాజకీయ పార్టీ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో తాసిల్దార్ విజయ కుమారి మాట్లాడుతూ బి ఎల్ వో లు ప్రతి ఇంటికి వెళ్లి సర్వే నిర్వహిస్తారని తెలిపారు. ఈ సమావేశానికి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు విజయ భాస్కర్ రెడ్డి. చెన్నూరు మండలం వైకాపా కన్వీనర్ ఎన్ భాస్కర్ రెడ్డి. కాంగ్రెస్ పార్టీ నాయకుడు పి చంద్రశేఖర్ రెడ్డి. పలువురు మైనార్టీ నాయకులు వివిధ పార్టీ నాయకులు సమావేశానికి హాజరయ్యారు.

# హజ్ యాత్ర పూర్తి చేసుకుని వచ్చిన అంజాద్ బాషాకు ఘన సన్మానం

**కడప మన జనప్రగతి జూన్ 13:–** పవిత్ర హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషాను వైఎస్సార్‌సీపీ ఆర్టీఐ నగర అధ్యక్షుడు తౌహిద్ ఖాన్ ఘనంగా సన్మానించారు. కడప నగరంలోని అంజాద్ బాషా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు దుశ్శాలువా కప్పి, పూలమాల వేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తౌహిద్ ఖాన్ మాట్లాడుతూ హజ్ యాత్ర ఇస్లాం మతంలో అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక యాత్ర అని అన్నారు. జీవితంలో ఒక్కసారైనా ప్రతి ముస్లిం సోదర, సోదరీమణులు హజ్ యాత్ర చేయాలని ఆకాంక్షిస్తారని పేర్కొన్నారు. మక్కా, మదీనా నగరాల్లో నిర్వహించే హజ్ ఆచారాలు, అరఫాత్ మైదానంలో ప్రార్థనలు, కాబా ప్రదక్షిణలు (తవాఫ్) వంటి పవిత్ర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో పూర్తి చేసి హాజీగా తిరిగి రావడం గొప్ప అదృష్టమని అన్నారు. అంజాద్ బాషా హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని క్షేమంగా తిరిగి రావడం ఆనందదాయకమని, ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు తౌహిద్ ఖాన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు, ఉపాధ్యక్షులు రవి, సాయి, అజయ్, షిండే, మధు తదితరులు పాల్గొన్నారు.




# యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలి

**యువతకు 5 సం"లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం: మంత్రి టిజి భరత్ గుప్త.**




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూన్ 13:–** ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న జాబ్ మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలని తద్వారా అనుభవం సాధించి భవిష్యత్తు లో మంచి అభివృద్ధి సాధించాలని కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీ జాబ్ మేళా సమావేశంలో యువతను ఉద్దేశించి పరిశ్రమలు,వాణిజ్యం మరియు ఫుడ్ ప్రోసెసింగ్ శాఖ మంత్రి టి జి భరత్ గుప్త పేర్కొన్నారు. శనివారం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నైపుణ్యాల అభివృద్ధి విభాగం మరియు శిక్షణ సంస్థ కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీ సమావేశ మందిరం లో ఏర్పాటు చేసిన 4 వ మెగా జాబ్ మేళా ను పరిశ్రమలు , వాణిజ్యం మరియు ఫుడ్ ప్రోసెసింగ్ శాఖ మంత్రి టి జి భరత్ గుప్త ప్రారంభించి యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కర్నూలులో ఇప్పటివరకు మూడు మెగా జాబ్ మేళాలు నిర్వహించామని అందులో కేవలం 50 శాతం ఉద్యోగాలు మాత్రమే యువత సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. దీనికి కారణం యువతలో నైపుణ్యం లేకపోవడం లేదా ఉద్యోగం వచ్చిన చేరకుండా ఉండొచ్చని అన్నారు. ఈరోజు 19 కంపెనీలు దాదాపు 1500 ఉద్యోగాలు యువతకు ఇచ్చే ఉద్దేశంతో ఇక్కడకు వచ్చాయని ఇందులో మీ ప్రతిభను చూపెట్టి ఉద్యోగాలు సాధించాలని , వచ్చిన ఉద్యోగంలో వెంటనే చేరిపోయి కొన్ని సంవత్సరాలు పాటు పని చేసి అనుభవం గడించాలని ఆ తరువాత మీకు ఏ విధంగా అభివృద్ధి చెందాలో పూర్తి అవగాహన వస్తుందని కావున ఇప్పుడు ఉన్న అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని యువతను కోరారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో 5 సంవత్సరాలలో 20 లక్షల ఉద్యోగాలు యువతకు అందించాలన్న దృఢ సంకల్పంతో పని చేస్తూ ఉన్నదని తెలిపారు. ప్రస్తుతం యువత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో కూడా పోటీ పడవలసిన అవసరం ఏర్పడిందని తెలిపారు. యువత వారి వారి రంగాలలో నైపుణ్యం సాధించి ఉండడం చాలా అవసరమని మంత్రి పేర్కొన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్ ఇండస్ట్రియల్ హబ్ లో రిలయన్స్ , అగస్తా , గ్రీన్ హైడ్రోజన్ , సోలార్ , విండ్ పవర్ ఉత్పత్తి లాంటి చాలా పెద్ద కంపెనీలు పనులు మొదలుపెట్టాయని జయరాజ్ ఇస్పాత్ విస్తరణ జరుగుతూ ఉందని మరియు రాష్ట్రంలో అన్ని జిల్లాలలో ఎం.ఎస్.ఎం.ఈ లు ఏర్పాటు చేస్తున్నామని వాటి ద్వారా ఉద్యోగాలు వస్తాయని అందుకు యువత ఆ కంపెనీలలో పనిచేయడానికి అవసరమైన అనుభవంతో సిద్ధంగా ఉండాలని కోరారు. ప్రస్తుతం దేశంలో ఏర్పాటు అవుతున్న క్రొత్త పరిశ్రమలలో 25 శాతం మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషితో ఆంధ్రప్రదేశ్ లోనే ఏర్పాటు అవుతున్నాయని , త్వరలో 50 శాతం చేరుకునే దానికి కూడా అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ విధంగా ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలిచే అవకాశం ఉందని తెలిపారు. అధికారుల కోరిక మేరకు యూనివర్సిటీ ప్రాంగణంలో మినరల్ వాటర్ ప్లాంట్ మరియు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి విడతలవారీగా సహకరిస్తామని మంత్రి తెలిపారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి క్లస్టర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకట బసవరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ద్వారా ఏర్పాటు కాబడిన ఈ యూనివర్సిటీ ద్వారా మంచి విద్యను అందిస్తున్నామని మరియు పరిశోధనలకు సహకరిస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంగణంలో 19 సంస్థల తో 4వ జాబ్ మేళాను దూర దృష్టిగల మంత్రి భరత్ గారు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపల్ నాగరాజు శెట్టి , డిస్టిక్ స్కిల్ డెవలప్మెంట్ అధికారి ఆనందరాజ కుమార్, రిజిస్ట్రార్ శ్రీనివాసులు యువత అభివృద్ధి చెందడానికి పలు సూచనలు తెలియజేశారు. అడ్మినిస్ట్రేటర్ అక్తర్ భాను , సమావేశము లో పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగితే కూటమికి పరాభవం ఖాయం..!

**● ప్రజల తీర్పుకు భయపడుతున్నది కూటమి ప్రభుత్వమే ● అవినీతి గురించి మాట్లాడే అర్హత టీడీపీకి లేదు ● టీడీపీ ర్యాలీ వ్యాఖ్యలకు ఘాటు కౌంటర్ ఇచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు**



**పులివెందుల స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 13:–**ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించి ప్రజల నిజమైన తీర్పును స్వీకరించే ధైర్యం కూటమి ప్రభుత్వానికి లేదని, స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు జరిగితే కూటమికి పరాభవం తప్పదని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. ప్రజల మద్దతు కోల్పోయిన కూటమి ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇటీవల పులివెందులలో టీడీపీ నిర్వహించిన ర్యాలీలో ఆ పార్టీ నాయకులు చేసిన వ్యాఖ్యలకు ప్రతిస్పందిస్తూ శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడారు. టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని, వైఎస్సార్‌సీపీ నాయకులు భయపడుతున్నారన్న ఆరోపణలు హాస్యాస్పదమని పేర్కొన్నారు. శుక్రవారం పులివెందులలో నిర్వహించిన "వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమానికి వేలాదిగా ప్రజలు, పార్టీ శ్రేణులు తరలివచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందనే ప్రజాగ్రహమే ఆ కార్యక్రమంలో ప్రతిబింబించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో నెలకొన్న అసంతృప్తికి పులివెందుల సభ నిదర్శనమని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలను అధికార బలంతో, పోలీసు యంత్రాంగం సహకారంతో నిర్వహిస్తామంటూ కూటమి నేతలు మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని మండిపడ్డారు. ప్రజల మద్దతు ఉంటే ఎన్నికలను స్వేచ్ఛగా నిర్వహించాలని, అధికార దుర్వినియోగానికి పాల్పడాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. గతంలో పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికలు ఎలా జరిగాయో ప్రజలకు బాగా తెలుసన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి వ్యక్తిగత సహాయకుడు కేఎన్‌ఆర్‌పై టీడీపీ నాయకులు చేస్తున్న విమర్శలను ఖండిస్తూ, అవినీతి గురించి మాట్లాడే నైతిక హక్కు టీడీపీకి లేదన్నారు. రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఎన్నో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న నాయకులు ఉన్న పార్టీయే టీడీపీ అని విమర్శించారు. ప్రజల తీర్పును ఎదుర్కొనే ధైర్యం లేకనే కూటమి ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆరోపించిన వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగితే ప్రజలు కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట్లూరు సుదర్శన్, మున్సిపల్ కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి దేవర శ్రీనివాసరెడ్డి, జిల్లా యువజన విభాగ సభ్యుడు లక్ష్మిరెడ్డి, ఇనగనూరు వైఎస్సార్‌సీపీ నాయకుడు బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీపై ప్రభుత్వం మౌనం ఎందుకు..?

**తమిళనాడు తరహాలో ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలి: తుమ్మల ధరణ్ కుమార్**



**పీలేరు మన జనప్రగతి జూన్ 13:–**ఆంధ్రప్రదేశ్‌లో ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నియంత్రణ చర్యలు చేపట్టకపోవడం ఆందోళనకరమని మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ విమర్శించారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే జోక్యం చేసుకుని ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించే చట్టాన్ని తీసుకురావాలని కోరారు. తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించేందుకు ప్రత్యేక చట్టాలు, ఫీజు నియంత్రణ కమిటీలు అమలులో ఉన్నాయని, కానీ ఆంధ్రప్రదేశ్‌లో అలాంటి వ్యవస్థ లేకపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక భారం ఎదుర్కొంటున్నారని అన్నారు. తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించేందుకు ప్రత్యేక చట్టాలు, ఫీజు నియంత్రణ కమిటీలు అమలులో ఉన్నాయని, కానీ ఆంధ్రప్రదేశ్‌లో అలాంటి వ్యవస్థ లేకపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక భారం ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలో అడ్మిషన్ ఫీజులు, డెవలప్‌మెంట్ ఫీజులు, బిల్డింగ్ ఫండ్, ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు, ప్రత్యేక ఫీజుల పేరుతో వేలాది రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఫీజు దోపిడీని అరికట్టాల్సిన ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైందని విమర్శించారు. తమిళనాడు తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో స్వతంత్ర ఫీజు నియంత్రణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల గరిష్ఠ ఫీజులను ప్రభుత్వం నిర్ణయించాలని, అక్రమ ఫీజులు, డొనేషన్లు, బిల్డింగ్ ఫండ్లు, ఇతర రహస్య వసూళ్లను పూర్తిగా నిషేధించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. "విద్య హక్కు వ్యాపారం కాదు. కార్పొరేట్ విద్యా దోపిడీకి చెక్ పెట్టి ఫీజు నియంత్రణ చట్టాన్ని వెంటనే తీసుకురావాలి" అని తుమ్మల ధరణ్ కుమార్ డిమాండ్ చేశారు.

## కడు రమణీయంగా శ్రీసుబ్రహ్మణ్యేశ్వర కల్యాణోత్సవం



**వేంపల్లె మన జనప్రగతి జూన్ 13:-** వేంపల్లె లోని శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం కడు రమణీయంగా నిర్వహించామని ఆలయ అర్చకులు శేషగిరిరావు తెలిపారు. శనివారం కృత్తికా నక్షత్రం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో వేద మంత్రోచ్చారణతో బెంగళూరుకు చెందిన భక్తుడి సహకారంతో కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అలయ ప్రతినిధి శింగనమల సాంబశివుడు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## వేంపల్లె ఎలక్ట్రికల్ అసోసియేషన్ ఆర్థిక సాయం

**- అధ్యక్షుడుముని కుమార్**




**వేంపల్లె మన జన ప్రగతి జూన్ 13:-** కిడ్నీ వ్యాధి తో బాధపడుతున్న తోటి ఎలక్ట్రిషన్ కీ తమ అసోసియేషన్ తరపున ఆర్థిక సాయం అందించినట్లు అధ్యక్షుడు వై.మునికుమార్ తెలిపారు. అసోసియేషన్ సభ్యుల సమక్షంలో బాధితుడు ఖాదర్ వలి కీ రూ. 6.200 నగదును అందజేశారు. ఏ సమస్య వచ్చినా తమ అసోసియేషన్ తరుపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు అబ్దుల్ హకీం, తదితరులు పాల్గొన్నారు.

## నేడు వేంపల్లె డాక్టర్ ఎస్.ఎఫ్ బాష ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం

**వేంపల్లె మన జనప్రగతి జూన్ 13:-** గండి రోడ్డు వేంపల్లె ఎస్ ఎఫ్ బాషా హాస్పిటల్ లో నేడు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు డాక్టర్ ఎస్ ఎఫ్ బాష, చైతన్య న్యూరో ఈఎన్టీ కేర్, ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే ఈ శిబిరంలో కడప వైద్యుడు ప్రియతమ భార్గవ్ పాల్గొని రోగులకు మెదడు,వెన్నెముక,నరములకు సంబంధించిన రోగాలకు పరీక్ష నిర్వహిస్తారు. ఈ శిబిరంలో అవసరమైన వారికి బీపీ,షుగర్ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇవ్వనున్నారని వారు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

## ఓటర్ జాబితాలో అర్హులకే చోటు కల్పించాలి: రాజంపేట సబ్ కలెక్టర్ భావన



**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 13:-** ఓటర్ జాబితాలో అర్హులైన స్థానికులకు మాత్రమే చోటు కల్పించాలని, అనర్హులు మరియు ఇతర ప్రాంతాలకు చెందిన వారి పేర్లను తొలగించాలని రాజంపేట సబ్ కలెక్టర్ భావన అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని మాధవరం-1, పార్వతీపురం గ్రామాల్లో ప్రత్యేక సర్వే కార్యక్రమాన్ని పరిశీలించిన ఆమె మాట్లాడుతూ, జూన్ 15 నుంచి జూలై 14 వరకు నిర్వహించే సర్వేలో ప్రతి ఓటరును క్షుణ్ణంగా గుర్తించి వివరాలు నమోదు చేయాలని సూచించారు. సిద్ధవటం మండలంలో ఓటర్ జాబితా పరిశీలనను 99 శాతం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. తహసీల్దార్ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి ఓటరును గుర్తించి మ్యాపింగ్ ప్రక్రియ చేపడతామని, అర్హులైన వారికి మాత్రమే ఓటరు జాబితాలో నమోదు కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఏలు, బీఎల్వోలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వేంపల్లె శ్రీ దుర్గమ్మ దేవస్థానంలో ఘనంగా ముగిసిన భాగవత సప్తాహం



**వేంపల్లె మన జనప్రగతి జూన్ 13:-**వేంపల్లె పట్టణంలోని శ్రీ దుర్గమ్మ దేవస్థానంలో ఆలయ వ్యవస్థాపకులు మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేది నుండి నిర్వహించిన భాగవత సప్తాహం శనివారంతో ఘనంగా ముగిసిందని పులివెందుల భాగవత భక్త సమాజం అధ్యక్షులు చిన్న శివారెడ్డి తెలిపారు. ఈ నెల 7వ తేది నుండి 13వ తేదీ వరకు భాగవత సప్తాహం (భగవద్గీత పారాయణం) భక్తీ శ్రద్ధలతో ఘనంగా నిర్వహించామని తెలిపారు. పులివెందుల భాగవత భక్త సమాజం అధ్యక్షులు చిన్న శివారెడ్డి, ఉపాధ్యక్షులు పాపిరెడ్డి మాట్లాడుతూ శనివారం వేంపల్లె దుర్గమ్మ ఆలయంలో భాగవత సప్తాహం వ్యవస్థాపకులు రవికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్ర పుష్పం,కలశ పూజ అనంతరం కలశ ప్రదక్షిణ భక్తీ శ్రద్ధలతో నిర్వహించామన్నారు. అనంతరం భాగవత భక్త సమాజం సభ్యులను రవికుమార్ రెడ్డి, కుమారుడు ప్రీతం కుమార్ రెడ్డి,కోడలు వైష్ణవి ఘనంగా సన్మానించారు. 7 రోజుల పాటు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం,రాత్రి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు రవికుమార్ రెడ్డి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో ఆరోగ్యకరమైన జీవనం సాధ్యం

**● యోగా పోటీలకు విశేష స్పందన ● కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి**



**తిరుపతి మన జనప్రగతి జూన్ 13:-** యోగాతో ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం కచ్చపి ఆడిటోరియం లో నిర్వహించిన యోగా పోటీలకు విశేష స్పందన లభించింది. యోగాంధ్ర -2026 లో భాగంగా శనివారం కచ్చపి ఆడిటోరియంలో పలు విభాగాల్లో పోటీలను నిర్వహించిన పోటీలను డిప్యూటీ కమిషనర్ అమరయ్య తో కలసి కమిషనర్ పరిశీలించారు. పలువురు యోగా గురువులు జడ్జిలుగా పాల్గొని యోగాలో ప్రతిభ కనపరిచిన వారిమి గుర్తించడం జరిగిందని తెలిపారు. జూనియర్స్, యంగర్స్, సీనియర్స్ మూడు కేటగిరిలుగా యోగా పోటీలు నిర్వహించామని తెలిపారు. వార్డు స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారికి జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు పంపుతామని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనపరిస్తే రాష్ట్ర స్థాయిలో పోటీలకు పంపడం జరుగుతుందని తెలిపారు. యోగా ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రతి ఒక్కరికీ చేరవేయాలనే లక్ష్యంతో ఈ యోగా పోటీలను నిర్వహిస్తున్నామని తెలుపారు. ఈ యోగా పోటీల్లో నగరపాలక సంస్థ రెవిన్యూ ఆఫీసర్స్ సేతు మాధవ్, రవి, యోగా గురువులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## కడప మున్సిపల్ శానిటరీ వర్కర్స్ సమ్మెపై స్పందించిన ఎమ్మెల్యే మాధవి,జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస రెడ్డి



**కడప మన జనప్రగతి జూన్ 13:-**కడప నగరంలో గత కొద్దిరోజులుగా మున్సిపల్ శానిటరీ వర్కర్స్ చేస్తున్న సమ్మెపై ప్రభుత్వ విప్, కడప శాసనసభ్యులు శ్రీమతి రెడ్డెప్పగారి మాధవి, టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ రెడ్డెప్పగారి శ్రీనివాస రెడ్డి సానుకూలంగా స్పందించారు. సమ్మెలో భాగంగా ఈరోజు వర్కర్స్ అందరూ ఎమ్మెల్యే గారి క్యాంప్ కార్యాలయానికి రాగా.. ఎమ్మెల్యే వారిని కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జీతాలు పెంచాలని, అలాగే ఉద్యోగం చేస్తూ చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు ఇవ్వాలని వర్కర్స్ కోరారు. ప్రస్తుతం రూ. 12,000 ఉన్న జీతాన్ని రూ. 15,000లకు పెంచుతూ.. వచ్చే సోమవారం రోజునే పెండింగ్ జీతాల బకాయిలను చెల్లిస్తామని అదేవిధంగా ఒక నెలలోపు జీతాల పెంపు అమలులోకి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉద్యోగం చేస్తూ చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు తక్షణమే కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ కి సూచించడం జరిగింది. వర్కర్ల స్థానిక సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని, ప్రభుత్వం, పార్టీ పరిధిలోని మిగిలిన అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని నేతలు హామీ ఇచ్చారు. ఈ సానుకూల నిర్ణయంతో శానిటరీ వర్కర్స్ హర్షం వ్యక్తం చేశారు. వర్కర్లను ఉద్దేశించి మాట్లాడుతూ మీ సమస్యలన్నీ తీర్చే బాధ్యత మాది, మీరెవరూ అధైర్యపడొద్దు. ప్రభుత్వ పరంగా మీకు అన్ని విధాలా అండగా ఉంటాము. అయితే, కడప నగర ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత మీ చేతుల్లోనే ఉన్నాయి. కాబట్టి మీరంతా బాధ్యతగా తీసుకొని పనులను చేయాలి. నగరం శుభ్రంగా ఉండేలా చూస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సహకరించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాస రెడ్డి వర్కర్లకు పిలుపునిచ్చారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం: మంత్రి పార్థసారథి



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 13:-**జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి హామీ ఇచ్చారు. శనివారం ప్రొద్దుటూరు పర్యటనకు వచ్చిన మంత్రిని ఆర్&బి అతిథి గృహంలో ప్రొద్దుటూరు ప్రెస్ క్లబ్ సభ్యులు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు. జర్నలిస్టులకు సామాజిక భద్రత కల్పించడంతో పాటు అర్హులైన పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ప్రెస్ క్లబ్ ప్రతినిధులు కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి పార్థసారథి, జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిశీలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## సిద్దవటంలో ఘనంగా మేడా రఘునాథరెడ్డి జన్మదిన వేడుకలు

**● నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచిన మేడా మధు సూధన రెడ్డి**





**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 13:-**రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం సిద్ధవటం మండలంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. భాకరాపేట సర్కిల్‌లో ఆయన సోదరుడు, ఎంఆర్‌కేఆర్ కంస్ట్రక్షన్స్ ఎండీ మేడా మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. కేక్ కట్ చేసి మేడా రఘునాథరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాధవరం1 గ్రామ పంచాయతీ పరిధిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నిరుపేద కుటుంబాలైన బత్తల మోహన్‌కృష్ణ, మామిళ్ల బాల కుటుంబాలను మేడా మధుసూదన్‌రెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే కొత్తమాధవరం గ్రామానికి చెందిన గుంటి ప్రసాద్ కుమారుడు జై కైలాష్ (10), బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని అతని వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ మేడా రఘునాథరెడ్డి ప్రజాప్రతినిధిగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలకు విశేష సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. అదే విధంగా మేడా మధుసూదన్‌రెడ్డి కూడా సామాజిక బాధ్యతతో నిరుపేదలకు, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం మేడా కుటుంబ ప్రత్యేకత అని, ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములవుతూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. ప్రజా సంక్షేమం పట్ల మేడా సోదరులు చూపుతున్న చొరవ యువతకు స్ఫూర్తిదాయకమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ మహిళా ప్రధాన కార్యదర్శి ఏకుల రాజేశ్వరీరెడ్డి, మండల అధ్యక్షుడు నీలకంఠారెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ దేరంగుల శివయ్య, మాజీ సర్పంచ్ కేవీ సుబ్బయ్య, వావిళ్ల శ్రీనివాసులురెడ్డి, అరవ నారాయణరెడ్డి, మాధవరం-2 గ్రామ వైసీపీ అధ్యక్షుడు శ్రీరాందాసు వెంకట్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డ్రైనేజ్ నాలా సమస్య పరిష్కారానికి రవికుమార్ యాదవ్ పర్యటన



**శేరిలింగంపల్లి మన జనప్రగతి జూన్ 13:-**గచ్చిబౌలి గ్రామం,ఇందిరా నగర్ లో గత ఎన్నో సంవత్సరాలుగా నాలా, డ్రైనేజ్ సమస్య వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, అంజయ్య నగర్ నుండి వచ్చే నాలా ను రాడిసన్ హోటల్ వద్ద కలుపగా సమస్య తీవ్రమై మొన్న పడిన వానకు గచ్చిబౌలి గ్రామం అంతా మురుగు నీటిమయమవుతుందని స్థానిక ప్రజలు తెలియజేయగా ,వెళ్లి పర్యటించి సంబంధిత అధికారులతో మాట్లాడి ఆ సమస్యను తక్షణమే పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరా నగర్ లో నాలా, డ్రైనేజీ సమస్య గతం లో ఎన్నో సంవత్సరాలుగా ఉందని, అనేక సార్లు పర్యటించి జీహెచ్ఎంసీ కార్యాలయం లో వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని, అంజయ్య నగర్ నాలా పి.జె.ఆర్ నగర్ వైపు వెళ్ళదని , కానీ అధికారులు రాడిసన్ హోటల్ వద్ద గచ్చిబౌలి గ్రామం మీదుగా వెళ్ళే నాలా లో కలపడం జరిగిందని, గతంలోనే సమస్య ఉన్న నాలా లో కలిపితే ఉన్న సమస్య తగ్గకపోగా పెద్దదిగా మారుతుందని ఆలోచన లేకుండా పనులు చేస్తున్నారని, ఏళ్లు గడుస్తున్న సమస్య మారలేదని, శాశ్వత పరిష్కార మార్గం చూపకపోగా ,కొత్త సమస్యను తెచ్చిపెట్టినట్లుందని ప్రజా ప్రతినిధులు, అధికారులు తీరుకు ఇదే నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఈ ప్రాంతంలో హాస్టల్స్ పెరిగాయి, ఇల్లు పెరిగాయి, నాలా ను పెద్దదిగా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, తక్షణమే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలు చేయిస్తున్నారు తప్ప శాశ్వత పరిష్కారం చేసే విధంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. లింగంపల్లి కంటేస్టేడ్ కార్పొరేటర్ ఎల్లేష్, నాయకులు ఓబుల్ రెడ్డి, మఖన్ సింగ్, నరసింహ, మహేందర్ యాదవ్, శశాంక్, రోహిత్, జై హింద్, మధు, రాఘవ చారి, రఘునాథ్, సుబ్రమణ్యం, దినేష్, రాము మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## అందర్నీ ఐక్యంగా ఉంచడమే కాంగ్రెస్ లక్ష్యం:విజయ జ్యోతి



**కడప మన జనప్రగతి జూన్ 13:-**కేంద్ర ప్రభుత్వంపై దేశవ్యాప్తంగా ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమికి అనుకూల ఫలితాలు తీసుకురావచ్చని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి పేర్కొన్నారు. శనివారం కడపలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించబడితే ఇండియా కూటమి విజయం సాధించడం ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతిపక్ష పార్టీలు ఐక్యంగా వ్యవహరించి పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్‌జేడీ వంటి పార్టీలు ప్రజా సమస్యలపై చేపట్టిన రాజకీయ పోరాటాలు ఫలితాలను ఇచ్చాయని గుర్తు చేశారు. ప్రస్తుతం ఎన్నికల కమిషన్ సహా పలు వ్యవస్థలు బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రభావంలో పనిచేస్తున్నాయని ఆరోపించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ కార్మిక విభాగం (కేకేసి) జిల్లా అధ్యక్షుడు దాసరి శ్రీనివాసులు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఫైరోజ్, జిల్లా ఉపాధ్యక్షుడు సిరాజుద్దీన్, మామిళ్ల బాబు, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు, మైనార్టీ నాయకులు రఫీఖ్ ఖాన్, జహూర్, ఇనామ్, సయ్యద్ బుడాన్ సాబ్, జాఫర్ హుస్సేన్, మహమ్మద్ సాదిక్, జిలాన్ భాష, అల్లా బకాష్, సైఫ్, ఆదామ్, మహబూబ్ భాష, హయాత్ భాష, ఖాజా హుస్సేన్, గుల్జార్, షాహిన్, షమీం తదితరులు పాల్గొన్నారు. **కేకేసి కడప నగర చైర్మన్‌గా షామీర్ హుస్సేన్** ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్మిక విభాగం (కేకేసి) కడప నగర చైర్మన్‌గా షామీర్ హుస్సేన్‌కు నియామక ఉత్తర్వులను జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి అందజేశారు. తన నియామకానికి సహకరించిన కేకేసి జిల్లా అధ్యక్షుడు దాసరి శ్రీనివాసులు, రాష్ట్ర చైర్మన్ కైపు వెంకట కృష్ణారెడ్డికి షామీర్ హుస్సేన్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం షామీర్ హుస్సేన్ కుటుంబ సభ్యులు విజయ జ్యోతి, బండి జకరయ్యలను ఘనంగా సన్మానించారు.

మనజనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం
14 - 06 - 2026

## అన్నమయ్య విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి

**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి జూన్ 13:-**తెలుగు సాహిత్యానికి విశిష్ట సేవలు అందించిన పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల విగ్రహ స్థాపనకు జిల్లా యంత్రాంగం తక్షణమే అనుమతి మంజూరు చేయాలని అన్నమాచార్య కళాపీఠం అధ్యక్షుడు ఎడవల్లి రమణయ్య కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసినట్లు ఆయన తెలిపారు. కడప జిల్లా తాళ్లపాక గ్రామంలో జన్మించిన అన్నమాచార్యులు శ్రీ వెంకటేశ్వర స్వామివారిపై వేలాది సంకీర్తనలు రచించి తెలుగు భక్తి సాహిత్యాన్ని విశ్వవ్యాప్తం చేశారని పేర్కొన్నారు. అలాంటి మహనీయుడు జిల్లాకు చెందినవారు కావడం ప్రతి ఒక్కరికీ గర్వకారణమని అన్నారు. గతంలో బుడ్డాయిపల్లె కూడలి సమీపంలో అన్నమయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నించగా, అధికారిక అనుమతులు లేని కారణంగా సంబంధిత అధికారులు తొలగించిన విషయం తెలిసిందేనని గుర్తుచేశారు. అయితే అన్నమాచార్యుల వంటి మహనీయుని విగ్రహ ఏర్పాటుపై ఎలాంటి అభ్యంతరాలు లేదా వివాదాలు లేవని పేర్కొన్నారు. ప్రజల్లో సాంస్కృతిక, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించే ఉద్దేశంతో విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని, ఈ విషయాన్ని సానుకూలంగా పరిశీలించి అవసరమైన అనుమతులు వెంటనే మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్టు తెలిపారు.

## ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు: సీఐ ప్రసాదరావు



**పులివెందుల, మన జనప్రగతి, జూన్ 13:-** పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, రహదారులపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ జి. ప్రసాదరావు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాలు, పులివెందుల డీఎస్పీ మురళీ సూచనల మేరకు శనివారం ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు తన సిబ్బందితో కలిసి పూల అంగళ్ళ సర్కిల్ నుంచి పాత ఆర్టీసీ సర్కిల్ వరకు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుకు అడ్డంగా నిలిపిన వాహనాలను తొలగించడంతో పాటు, ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన దుకాణాలు, తోపుడు బండ్లను తొలగింపజేశారు. ఆయన మాట్లాడుతూ రహదారులపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలిపివేయడం వల్ల పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వాహనదారులు తమ వాహనాలను క్రమబద్ధంగా పార్కింగ్ చేసి ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని కోరారు. అలాగే ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు నిర్వహించే చిన్న వ్యాపారులు తమ తోపుడు బండ్లు, పండ్ల గంపలు తదితరాలను రహదారికి ఆటంకం కలగకుండా ఉంచాలని సూచించారు. కొంతమంది దుకాణదారులు తమ షాపులకు సంబంధించిన వస్తువులను రోడ్డుపై ఉంచి ట్రాఫిక్ సమస్యలకు కారణమవుతున్నారని పేర్కొంటూ, వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వారిపై జరిమానాలు విధించడంతో పాటు చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని సీఐ ప్రసాదరావు హెచ్చరించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మేకలవాని కాల్వ బ్రిడ్జి కింద రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలి:సదుం నాగరాజు

### - దక్షిణ మధ్య రైల్వే ఇన్‌చార్జ్ జీఎం సందీప్ మాథుర్‌కు వినతిపత్రం



**పీలేరు మన జనప్రగతి జూన్ 13:-**పీలేరు పట్టణ ప్రజల చిరకాల సమస్యగా ఉన్న అజంతా టాకీస్ రోడ్డుమేకలవాని కాల్వ మార్గంలోని రైల్వే బ్రిడ్జి కింద మురుగునీటి కాలువ, సిమెంట్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని పీలేరు సింగిల్ విండో మాజీ ఉపాధ్యక్షులు సదుం నాగరాజు, మాజీ వార్డు సభ్యులు టి. ఉదయ్ కుమార్ దక్షిణ మధ్య రైల్వే ఇన్‌చార్జ్ జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్‌ను కోరారు. రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి ఆదేశాల మేరకు కడప జిల్లా పర్యటనకు వచ్చిన జీఎంను శుక్రవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. గుంతకల్లు రైల్వే డివిజన్ వినియోగదారుల సలహా సంఘం సభ్యుడు టి. భరత్ కుమార్ రెడ్డి నేతృత్వంలో ఈ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మేకలవాని కాల్వ మార్గంలోని రైల్వే బ్రిడ్జి కారణంగా అక్కడ మురుగునీటి కాలువ నిర్మాణం చేపట్టలేకపోతున్నామని తెలిపారు. దీంతో మురుగునీరు నిల్వ ఉండి స్థానికులకు తీవ్ర అసౌకర్యం కలిగించడంతో పాటు అనారోగ్య సమస్యలకు కూడా కారణమవుతోందని జీఎం దృష్టికి తీసుకెళ్లారు. అలాగే మురుగునీటి కాలువ, సిమెంట్ రోడ్డు నిర్మాణం అవసరాన్ని వివరిస్తూ ఎంపీ మిథున్ రెడ్డి అందజేసిన సిఫారసు లేఖను కూడా జీఎంకు సమర్పించారు. సమస్య తీవ్రతను గుర్తించిన జీఎం సందీప్ మాథుర్ సానుకూలంగా స్పందించి, త్వరలోనే అవసరమైన అనుమతుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సదుం నాగరాజు తెలిపారు. ఈ పనులు పూర్తయితే అజంతా టాకీస్ రోడ్డు, ఎర్రంరెడ్డి గుట్ట ప్రాంతాల ప్రజలను దశాబ్దాలుగా వేధిస్తున్న మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడమే కాకుండా, పీలేరు పట్టణంలో ట్రాఫిక్ రద్దీ సమస్య కూడా కొంత మేర తగ్గే అవకాశం ఉందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## బేతానియా చర్చి వ్యవహారంలో ఉద్రిక్తతలు నివారించేందుకు పోలీసుల చర్యలు

**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 13:-**పట్టణం లోని విజయనగరం వీధిలో ఉన్న బేతానియా చర్చిలో పాస్టర్ నియామకానికి సంబంధించిన వివాదం మరోసారి చర్చనీయాంశంగా మారింది. సంఘ సభ్యులలోని రెండు వర్గాల మధ్య కొనసాగుతున్న అభిప్రాయ భేదాలు శాంతిభద్రతల సమస్యలకు దారితీయకుండా ఉండేందుకు పోలీసులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. ఈ క్రమంలో వివాదానికి సంబంధం ఉన్న 14 మంది వ్యక్తులను తహశీల్దార్ సమక్షంలో బౌండ్ ఓవర్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. భవిష్యత్తులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఈ అంశంపై స్పందించిన ప్రొద్దుటూరు అసిస్టెంట్ సుపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ విభు కృష్ణ, చర్చి వ్యవహారాలను కారణంగా చూపుతూ ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. వివాదాలను వీధుల్లోకి తీసుకురావడం కాకుండా న్యాయపరమైన మార్గాలను ఆశ్రయించాలని సూచించారు. సంఘ సభ్యుల మధ్య ఉన్న అభ్యంతరాలు, అభిప్రాయ భేదాలను పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకోవడం ఉత్తమ మార్గమని పేర్కొన్నారు. అవసర మైతే న్యాయస్థానాలను ఆశ్రయించి చట్టబద్ధంగా సమస్య పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పాస్టర్ నియామకం అంశాన్ని ఆధారంగా చేసుకుని ఎవరైనా ఉద్రిక్తతలను రెచ్చగొట్టే ప్రయత్నం చేసినా, ఇతరులను ప్రేరేపించినా లేదా ప్రత్యక్షంగా అల్లర్లకు కారణమైనా వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చర్చి వివాదం మరింత ముదరకుండా అన్ని వర్గాలు సంయమనం పాటించి, పరస్పర సహకారంతో సమస్య పరిష్కారానికి ముందుకు రావాలని పోలీసులు కోరారు.

## పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకి బూత్ లెవల్ ఏజెంట్లు సహకరించాలి

**● నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి శారదా దేవి.**



**తిరుపతి మన జనప్రగతి జూన్ 23:** 167-తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గంలోని బూత్ లెవల్ ఏజెంట్లందరూ పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలని నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి శారదా దేవి కోరారు. 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - 2026'లో భాగంగా, గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్లతో శనివారం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో అవగాహన సదస్సు (ఓరియంటేషన్ వర్క్‌షాప్) నిర్వహించారు. ఈ సమావేశంలో బూత్ లెవల్ ఏజెంట్లకు ప్రత్యేక సమగ్ర సవరణ అంటే ఏమిటి, దాని ఆవశ్యకత, ఉద్దేశం మరియు అందులోని వివిధ ప్రక్రియలను క్షుణ్ణంగా వివరించారు. అలాగే, ప్రస్తుతం జరుగుతున్న ఎలక్టార్ మ్యాపింగ్, ఎస్.ఐ.ఆర్ షెడ్యూల్, ఎన్యూమరేషన్ (గణన) దశతో పాటు, ఈ ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్ల కీలక పాత్ర గురించి అవగాహన కల్పించారు. వంద శాతం పారదర్శకమైన, స్వచ్ఛమైన తుది ఓటర్ల జాబితా తయారీకి ఏజెంట్లందరూ తమ వంతు సహకారం అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అన్నీ రాజకీయ పార్టీలు తమకు సంబందించిన బూత్ లెవల్ ఏజెంట్ల యొక్క నియామకమును నిర్దేశించిన ఫార్మాట్ నందు ఆఫీసుకు రెండు రోజులలో సమర్పించాలని కోరడమైనది. ఎనుమేరేషన్ ఫారం నందు ప్రస్తుత ఓటరు యొక్క లేటెస్ట్ పాస్ పోర్ట్ సైజు కలర్ ఫోటో సేకరించి దీూా లకు అందజేయాలని కోరారు. అనంతరం బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రత్యేక సమగ్ర సవరణ పై వ్యక్తం చేసిన పలు సందేహాలు, అనుమానాలను అధికారులు నివృత్తి చేశారు. ఈ సమావేశంలో సహాయ ఓటర్ల నమోదు అధికారులు (ూజు=ూ) అమరయ్య, వి.సురేష్ బాబు, ఎన్నికల ఉప తహశీల్దార్ సుధాకర్ నాయక్ మరియు అన్ని రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో నిందితుడి కోసం గాలింపు

### - కోర్టు ఆదేశాల మేరకు లొంగిపోవాలని పోలీసుల సూచన

**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి జూన్ 13:-**పట్టణానికి చెందిన ఓ పోక్సో కేసు నిందితుడిపై కడప ప్రత్యేక పోక్సో న్యాయస్థానం నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. దీంతో నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు చర్యలు ముమ్మరం చేశారు. 2016లో ప్రొద్దుటూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో నిందితుడిగా ఉన్న బోనాల సుదర్శన్ రావుపై విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో న్యాయస్థానం ఈ వారెంట్ జారీ చేసినట్లు టూ టౌన్ సీఐ వంశీనాథ్ తెలిపారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం నిందితుడు వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో హాజరై చట్టపరమైన ప్రక్రియకు సహకరించాలని సూచించారు. ప్రస్తుతం నిందితుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతు న్నాయని పోలీసులు వెల్లడించారు. అతని నివాస స్థలం లేదా సంచారంపై సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీసులను సంప్రదించాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలను రహస్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. న్యాయస్థానం ఆదేశాల అమలు కోసం ప్రత్యేక బృందాలు పని చేస్తున్నాయని, ప్రజల సహకారం ఉంటే నిందితుడిని త్వరితగతిన గుర్తించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరని, నిందితుడు స్వచ్ఛందంగా లొంగిపోవడం ఉత్తమమని ఆయన సూచించారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించాలి


**● అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి**

**● డీసీసీ అధికార ప్రతినిధి ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్**



**రాయచోటి మన జనప్రగతి జూన్ 13:-**భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ పూర్తిగా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధికార ప్రతినిధి ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్ కోరారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా రాష్ట్ర ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మరణించిన వారు లేదా అర్హత కోల్పోయిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించడం పట్ల ఎవరికీ అభ్యంతరం ఉండదని, అయితే అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో లేకపోతే వారు తీవ్ర మనస్థాపానికి గురవుతారని పేర్కొన్నారు. గ్రామ, వార్డు స్థాయిలో బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ తిరిగి సేకరించే వివరాలు ముసాయిదా ఓటరు జాబితాతో సరిపోలేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే అధికార, ప్రతిపక్ష రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) కూడా ఈ ప్రక్రియలో భాగస్వాములు అయ్యేలా చూడాలని కోరారు. ఓటరు జాబితాపై ఎవరైనా అభ్యంతరాలు వ్యక్తం చేస్తే వాటిని పరిశీలించి, సంబంధిత వారికి తమ వాదనలు వినిపించే అవకాశం కల్పించాలని అన్నారు. కుటుంబ సభ్యుల వివరాలు, ఫ్యామిలీ మ్యాపింగ్ అంశాలను కూడా సమగ్రంగా పరిశీలించి ఓటర్ల ధృవీకరణ చేపట్టాలని సూచించారు. ప్రజలకు అవసరమైన పత్రాల సమర్పణ, ఓటరు నమోదు ప్రక్రియపై విస్తృత అవగాహన కల్పించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా, నిష్పక్షపాతంగా సాగేందుకు జిల్లా ఎన్నికల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మన్సూర్ అలీ ఖాన్ విజ్ఞప్తి చేశారు.

## శనిత్రయోదశి సందర్భంగా శనేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 13:-**కడపచెన్నై జాతీయ రహదారిపై భాకరాపేట సమీపంలోని మందగిరి శనేశ్వర ఆలయంలో శనివారం త్రయోదశి సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. శనేశ్వరునికి తైలాభిషేకం సహా విశేష ఆరాధనలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రమణ్యం శర్మ తెలిపారు. శని దోషాలు ఉన్న భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తే శుభ ఫలితాలు కలుగుతాయని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా మండల ఎస్సై హారిక ఆధ్వర్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## రౌడీషీటర్లు రెచ్చిపోతే కఠిన చర్యలు తప్పవు: సీఐ వెంకటేశ్వర్లు



**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 13:-**రౌడీషీటర్లు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ దౌర్జన్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శనివారం సిద్ధవటం పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఒంటిమిట్ట, సిద్ధవటం, నందలూరు మండలాల పరిధిలో రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. భూ ఆక్రమణలు, బెదిరింపులు, గూండాగిరి, గొడవలు సృష్టించి ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తే సహించబోమన్నారు. గ్రామాల్లో ఎవరైనా రౌడీయిజానికి పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్లు మంచి ప్రవర్తనతో ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై హారికతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సీపీఆర్‌తో మహిళకు ప్రాణం పోసిన వైద్యుడు



**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 13:-**మండలంలోని మాధవరం-1 గ్రామంలో హైవే రోడ్డుపై అపస్మారక స్థితిలో పడిపోయిన యువతికి సకాలంలో సీపీఆర్ నిర్వహించి ప్రాణాపాయం నుంచి కాపాడిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సువర్ణ (19) ఇంటికి వెళుండగా ఒక్కసారిగా రోడ్డుపై కుప్పకూలింది. సమాచారం అందుకున్న శాంతి హెల్త్ కేర్ వైద్యుడు డాక్టర్ లక్ష్మీనారాయణ వెంటనే అక్కడికి చేరుకుని సీపీఆర్ నిర్వహించడంతో ఆమెకు మళ్లీ శ్వాస అందింది. అనంతరం మెరుగైన చికిత్స కోసం 108 అంబులెన్స్ ద్వారా కడప రిమ్స్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. బలహీనత నివారణకు పాలు, గుడ్లు, ఆకుకూరలు వంటి పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు తగినంత నీరు తాగాలని సూచించారు. మహిళ ప్రాణాలను కాపాడిన డాక్టర్ లక్ష్మీనారాయణకు సువర్ణ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.


## చెన్నూరులో ప్రైవేట్ వైద్యశాలలు తనిఖీ..



**చెన్నూరు మన జనప్రగతి జూన్ 14:-**చెన్నూరు పరిధిలోని ప్రథమ చికిత్స కేంద్రాలు( ఆర్ఎంపీలు) లను జిల్లా ఆరోగ్య అధికారి ఆదేశాల మేరకు శనివారం చెన్నూర్ లో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ప్రథమ చికిత్స కేంద్రాలను డాక్టర్ వినయ్ కుమార్ తనిఖీ చేయడం జరిగింది. ఆయన మాట్లాడుతూ క్లినిక్ నందు ప్రథమ చికిత్స మాత్రం చేయాలి ఇంజక్షన్లు గాని సెలైన్ బాటిల్స్ గాని యాంటీ బాటిక్స్ మందుల ద్వారా వైద్యం చేయకూడదని తెలిపారు కేవలం అనారోగ్యంతో వచ్చిన వారికి ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్య సేవ కొరకు ఉన్నత స్థాయిహాస్పిటల్ రిఫర్ చేయాలి ఎక్కువ ఆరోగ్య సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకుని రావాలి ప్రైవేట్ క్లినిక్స్ యొక్క గుర్తింపు పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు ఆర్ఎంపీ లు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి అంతకు పైబడిన వైద్యం చేసిన యెడల చట్టరీత్యా నేరమని తెలియజేశారు వచ్చిన వారికి ప్రథమ చికిత్స ఆరోగ్య సలహాలు ఇవ్వాలని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ సుబ్బరామయ్య హెల్త్ అసిస్టెంట్ నరసయ్య ముని రెడ్డి పాల్గొనడం జరిగింది..

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా పంతం | అభివృద్ధి మా లక్ష్యం
14 - 06 - 2026

## వర్షంలోనూ ప్రజాసేవలో సైబరాబాద్ పోలీసులు



**సైబరాబాద్ మన జనప్రగతి జూన్ 13:–** సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ మరియు లా అండ్ ఆర్డర్ పోలీసు అధికారులు, సిబ్బంది రోడ్లపై ప్రత్యేకంగా విధులు నిర్వర్తిస్తున్నారు.ప్రధాన కూడళ్లు, ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలు, నీరు నిలిచే ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు వాహనాల రాకపోకలను నియంత్రిస్తూ ట్రాఫిక్ సజావుగా సాగేలా చర్యలు చేపడుతున్నారు. అదే విధంగా లా అండ్ ఆర్డర్ సిబ్బంది ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందిస్తూ, వర్షం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి అండగా నిలుస్తున్నారు. వర్షపు నీటితో నిండిన ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా సూచనలు చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన అందించేందుకు అన్ని పోలీసు యంత్రాంగాలు అప్రమత్తంగా పనిచేస్తున్నాయి.ప్రజలు కూడా అవసరమైతే తప్ప బయటకు రావద్దని, వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలని, ట్రాఫిక్ పోలీసుల సూచనలను పాటించాలని సైబరాబాద్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## కారుణ్య నియామకం పొందిన చింతం ప్రదీప్‌కు మంత్రి అభినందనలు



**రాయచోటి మన జనప్రగతి జూన్ 13:–**కారుణ్య నియామకం కింద సంబేపల్లి హైస్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన కీర్తిశేషులు చింతం రాజశేఖర్ రెడ్డి కుమారుడు చింతం ప్రదీప్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రవాణా, యువజన & క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ప్రదీప్ కుమార్ రెడ్డి మంత్రిని శాలువాతో సత్కరించగా, మంత్రి ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఉద్యోగ బాధ్యతలను నిజాయితీతో, అంకితభావంతో నిర్వహించాలని సూచించారు. కారుణ్య నియామకాల ద్వారా బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రి అభిమాని మద్దిరాళ్ల అనిల్ కుమార్‌తో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొని ప్రదీప్ కుమార్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**



**రాయచోటి మన జనప్రగతి జూన్ 13:–**ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వేగంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన మరియు క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలో ఉన్న తన కార్యాలయంలో మంత్రి ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఒక్కరి సమస్యను ఓర్పుతో ఆలకించిన మంత్రి, సంబంధిత శాఖల అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ప్రభుత్వం సామాన్య ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.ప్రజల ఆశీర్వాదం, సహకారంతో మరింత సమర్థవంతంగా సేవలు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని మంత్రి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జూన్ 17 నుంచి 21 వరకు కడపలో ఆంధ్ర ప్రీమియర్ లీగ్-6 మ్యాచ్‌లు

**● రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో తొలిసారిగా ఏపీఎల్ పోటీలు..ప్రేక్షకులకు ఉచిత ప్రవేశం**




**కడప మన జనప్రగతి జూన్ 13:–**రాయలసీమలో తొలిసారిగా కడపలోని రాజారెడ్డి క్రికెట్ స్టేడియం వేదికగా ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) 6వ సీజన్ మ్యాచ్‌లు ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఏసీఏ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ సభ్యుడు భరత్ కుమార్ రెడ్డి తెలిపారు.శనివారం రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కడప క్రికెట్ చరిత్రలో తొలిసారిగా ఆంధ్ర ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లు నిర్వహించడం జిల్లాకు గర్వకారణమని అన్నారు.ఈ పోటీల నిర్వహణకు కృషి చేసిన ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసినేని చిన్ని, కార్యదర్శి సానా సతీష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.జూన్ 17 నుంచి 21 వరకు జరిగే ఈ టోర్నీలో మొత్తం ఏడు జట్లు పాల్గొని తొమ్మిది మ్యాచ్‌లు ఆడనున్నాయని చెప్పారు. ఇందులో నాలుగు మ్యాచ్‌లు పగటి వేళల్లో, ఐదు మ్యాచ్‌లు ఫ్లడ్‌లైట్ల వెలుగులో రాత్రి వేళల్లో నిర్వహించనున్నట్లు వివరించారు.మ్యాచ్‌ల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని, స్టేడియాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేస్తున్నామని తెలిపారు. ప్రేక్షకుల కోసం తాగునీరు, కూర్చునే సదుపాయం, పార్కింగ్ తదితర అన్ని సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు.మ్యాచ్‌లను వీక్షించేందుకు ఎలాంటి ప్రవేశ రుసుము లేదని, జిల్లా ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆంధ్ర ప్రీమియర్ లీగ్ పోటీలను ఆస్వాదించాలని భరత్ కుమార్ రెడ్డి కోరారు.ఈ కార్యక్రమంలో రాజారెడ్డి స్టేడియం చైర్మన్ శ్రావణ్ రెడ్డి, కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మునికుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోలు, డీజిల్ ధరల పెరుగుదలతో ఆటో చార్జీల పెంపు

**● ప్రయాణికుల సహకారం కోరిన బిస్మిల్లా ఆటో యూనియన్**



**పీలేరు మన జనప్రగతి జూన్ 13:–**పెట్రోలు, డీజిల్ ధరల పెరుగుదలతో పాటు వాహనాల నిర్వహణ ఖర్చులు అధికమవుతున్న నేపథ్యంలో పీలేరు పట్టణంలో ఆటో చార్జీలను పెంచాలని బిస్మిల్లా ఆటో యూనియన్ నిర్ణయించింది. ఈ మేరకు శనివారం స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణంలో ఆటో డ్రైవర్ల సమావేశం నిర్వహించారు. సమావేశానికి పీలేరు మార్కెట్ యార్డ్ చైర్మన్, బిస్మిల్లా ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షులు పురం రామ్మూర్తి, ఐఎన్టీయూసీ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు రత్నకుమార్, ఉమ్మడి జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహ ప్రసాద్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా బిస్మిల్లా ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బోదేశావల్లి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం, మరోవైపు ఇంధన ధరలు పెరగడం వల్ల ఆటో డ్రైవర్లు, యజమానులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.బ్యాంకులు, ఫైనాన్షియర్ల వద్ద తీసుకున్న రుణాలకు వడ్డీలు చెల్లించలేని పరిస్థితి నెలకొందని, కుటుంబ పోషణతో పాటు పిల్లల విద్యాభారం కూడా పెరిగిందన్నారు.ప్రభుత్వం అందిస్తున్న రూ.10 వేల ఆర్థిక సహాయం వాహనాల చలానాలు, రెన్యూవల్ ఖర్చులకే సరిపోతోందని, విధిలేని పరిస్థితుల్లో ఆటో చార్జీలను పెంచాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఆటోల్లో ప్రయాణించే ప్రజలే తమకు దేవుళ్లని, ప్రయాణికులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఐఎన్టీయూసీ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు రత్నకుమార్, మార్కెట్ యార్డ్ చైర్మన్ పురం రామ్మూర్తి మాట్లాడుతూ, పెరిగిన ఇంధన ధరలు మరియు వాహనాల నిర్వహణ వ్యయాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.యూనియన్ సభ్యులు వెల్లడించిన వివరాల ప్రకారం, కొత్త చార్జీలు జూన్ 13 నుంచి అమల్లోకి రానున్నాయి. పట్టణ పరిధిలో కనీస ఆటో బాడుగను రూ.40గా, షేర్ ఆటో టికెట్ ధరను రూ.20గా నిర్ణయించారు. కొత్త ధరల వివరాలతో కూడిన స్టిక్కర్లను అన్ని ఆటోలకు అతికించారు.ఆటో డ్రైవర్ల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయాన్ని ప్రజలు అర్థం చేసుకుని సహకరించాలని బిస్మిల్లా ఆటో యూనియన్ నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో పీలేరు పట్టణ ఉపాధ్యక్షులు హరినాథ్ నాయక్, ఆర్కాట్ దినేష్ బాబు, జిలాని, వెంకటేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సైనిక సేవకులను తీర్చిదిద్దుతున్న మహర్షి డిఫెన్స్ అకాడమీ..

**● మొదటి ఏడాదిలోనే 22 మంది యువకులు ఆర్మీకి ఎంపిక**




**పీలేరు మన జనప్రగతి జూన్ 13:–**దేశానికి సేవ చేసే అవకాశం గ్రామీణ ప్రాంతాల యువతకు కూడా అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో పీలేరులో స్థాపించిన మహర్షి డిఫెన్స్ అకాడమీ తొలి ఏడాదిలోనే విశేష ఫలితాలను సాధించింది. అతి తక్కువ ఫీజుతో నాణ్యమైన శిక్షణ అందిస్తూ యువతలో దేశభక్తి, క్రమశిక్షణను పెంపొందించడమే తమ ప్రధాన ఉద్దేశమని అకాడమీ నిర్వాహకులు తెలిపారు.అకాడమీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, వైస్ చైర్మన్ మురళీ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల యువతకు దేశ సేవతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇద్దరు మిత్రులు కలిసి ఈ అకాడమీని ప్రారంభించామని చెప్పారు. తొలి ఏడాదిలో 25 మందికి శిక్షణ అందించగా, వారిలో 22 మంది భారత సైన్యంలో జవాన్లుగా ఎంపిక కావడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు.ఈ విజయాన్ని పురస్కరించుకుని అకాడమీ ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. భవిష్యత్తులో మరింత మంది యువతను సైన్యంలోకి పంపే లక్ష్యంతో శిక్షణ కార్యక్రమాలను విస్తరించనున్నట్లు పేర్కొన్నారు.గ్రామీణ యువతకు సైనిక రంగంలో అవకాశాలు కల్పిస్తూ, దేశ సేవకు వారిని సిద్ధం చేస్తున్న మహర్షి డిఫెన్స్ అకాడమీ స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది.



## మన హక్కులను సాధించుకోవడానికి సమిష్టిగా ముందుకు పోదాం

**● దూదేకుల ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిద్దయ్య**



**తిరుపతి మన జనప్రగతి జూన్ 13 :** రాష్ట్రవ్యాప్తంగా మనమంతా సమిష్టిగా ముందుకు వెళితేనే మన హక్కులను సాధించుకోవచ్చునని రాష్ట్ర దూదేకుల/ నూర్ భాషా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పగిడాల సిద్దయ్య తెలిపారు. శనివారం మైనారిటీ హాలులో జిల్లా దూదేకుల నూర్ భాషా కులస్తుల సమావేశం జిల్లా అధ్యక్షులు సునీల్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పగడాల సిద్దయ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మన కమ్యూనిటీ వాళ్లు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని వాటిని సాధించుకోవాలంటే మనమంతా ఐక్యంగా ఉంటేనే సాధించవచ్చునన్నారు. దూదేకుల విద్యార్థుల సమస్యలపై కాలేజీ స్కూళ్లలో ఇవ్వాల్సిన టీసీలలో స్పష్టమైన కుల ధృవీకరణ పత్రాలు ఇచ్చేలా చూడాల్సిన బాధ్యత యూనియన్ నాయకుల పైనే ఉందన్నారు. శాశ్వత పరిష్కారం దొరికేలా ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. విద్యార్థుల కుల ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి శాశ్వత జీవో విడుదల చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అనంతరం దూదేకుల/ నూర్ భాష సంఘం జిల్లా అధ్యక్షులు సునీల్ దత్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలలో మన కమ్యూనిటీ కార్యవర్గాలు ఉన్నప్పటికీ సమస్యల పట్ల పూర్తిగా అవగాహన లేకపోవడం, ప్రజా ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకు పోవడంలో వెనుకబడి ఉన్నామన్నారు. అన్నిటినీ దృష్టిలో పెట్టుకొని ఎవరికైనా మన కమ్యూనిటీ వాళ్లకు అన్యాయం జరిగితే అందరం కలిసికట్టుగా ఎదుర్కొని వారికి న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత మన సంఘంపై ఉందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ అబ్దుల్ గఫూర్, జిల్లా ఉపాధ్యక్షులు మున్సిపల్ ఖాదర్ బాషా, జిల్లా నలుమూలల నుండి వచ్చిన కమ్యూనిటీ నాయకులు పాల్గొన్నారు.

## అమరావతి నిర్మాణాలపై తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు: మంత్రి నారాయణ

**హ్యాపీనెస్ట్ నిర్మాణ వ్యయం చదరపు అడుగుకు రూ.3,393 మాత్రమే**

**కేంద్ర ప్రభుత్వ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ కంటే తక్కువ ఖర్చు**

**గెజిటెడ్ అధికారుల నివాసాల నిర్మాణ వ్యయం చదరపు అడుగుకు రూ.3,684 మాత్రమే**


**రాజధానిలో కొండవీటి వాగు, పాలవాగులపై నిర్మిస్తున్న బ్రిడ్జిల పనులను పరిశీలించిన మంత్రి**



**అమరావతి మన జనప్రగతి జూన్ 13:** అమరావతి రాజధాని నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, నిర్మాణ వ్యయాలపై కొందరు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అసత్యమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. శనివారం అమరావతిలో పర్యటించిన మంత్రి కొండవీటి వాగు, పాలవాగులపై నిర్మిస్తున్న బ్రిడ్జిల నిర్మాణ పనులను పరిశీలించారు.వర్షాకాలంలో ఆయా బ్రిడ్జిల వద్ద నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమరావతి నిర్మాణాలపై వైసీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వాస్తవ గణాంకాలను పరిశీలిస్తే రాజధానిలో నిర్మిస్తున్న భవనాల వ్యయం పూర్తిగా సహేతుకంగానే ఉందని చెప్పారు. అమరావతిలో నిర్మిస్తున్న హ్యాపీనెస్ట్ నివాస సముదాయాలకు రూ.984 కోట్లతో టెండర్ ఖరారైందని, నిర్మాణ వ్యయం చదరపు అడుగుకు కేవలం రూ.3,393 మాత్రమే అవుతోందని తెలిపారు. అలాగే గెజిటెడ్ అధికారుల నివాసాల నిర్మాణానికి రూ.1,003 కోట్లతో టెండర్ ఖరారైందని, చదరపు అడుగుకు రూ.3,684 మాత్రమే వ్యయం అవుతోందని పేర్కొన్నారు.ఇటీవల కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన కేంద్ర ప్రభుత్వ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.1,234 కోట్లతో టెండర్ ఖరారైందని, దాని నిర్మాణ వ్యయం చదరపు అడుగుకు రూ.3,945గా ఉందని మంత్రి వెల్లడించారు. ఈ గణాంకాలను పోల్చి చూస్తే అమరావతిలో నిర్మిస్తున్న హ్యాపీనెస్ట్, గెజిటెడ్ అధికారుల నివాసాల నిర్మాణ వ్యయం కేంద్ర ప్రభుత్వ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ కంటే తక్కువగా ఉందని స్పష్టమవుతోందన్నారు.రాజధానిలో నిర్మిస్తున్న అనేక భవనాలు సాధారణ భవనాలు కాదని, రాష్ట్ర ప్రతిష్ఠను చాటే ఐకానిక్ నిర్మాణాలని మంత్రి తెలిపారు. భవిష్యత్తు అవసరాలు, ఆధునిక సౌకర్యాలు, అంతర్జాతీయ ప్రమాణాలు, దీర్ఘకాలిక వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్మాణాలు చేపడుతున్నామని చెప్పారు. అందువల్ల కొన్ని ప్రత్యేక భవనాలకు వ్యయం ఎక్కువగా కనిపించినా, వాటి నాణ్యత మరియు ప్రయోజనాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.దేశంలో పార్లమెంట్ భవనం నిర్మాణం, తెలంగాణ సచివాలయం నిర్మాణం వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల విషయంలో కూడా మొదట పిలిచిన టెండర్ల అంచనాలతో పోలిస్తే పనులు పూర్తయ్యే సమయానికి వ్యయం పెరిగిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే అమరావతి నిర్మాణాల విషయంలో ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా వ్యవహరిస్తోందని తెలిపారు.ఈ సందర్భంగా కొండవీటి వాగు, పాలవాగులపై జరుగుతున్న పనులను పరిశీలించిన మంత్రి, రాజధాని నిర్మాణంలో వరద నీటి నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. కొండవీటి వాగు, పాలవాగులపై మొత్తం 69 బ్రిడ్జిలు నిర్మిస్తున్నామని, అందులో వాగులపై 43 బ్రిడ్జిలు, ఎల్పీఎస్ లేఅవుట్లలో మరో 26 బ్రిడ్జిలు నిర్మిస్తున్నట్లు వివరించారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని బ్రిడ్జిల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థలు, నీటి ప్రవాహ మార్గాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. ఎక్కడా వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపడుతున్నామని, నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. బ్రిడ్జిల నిర్మాణం వల్ల నీటి ప్రవాహ సామర్థ్యం తగ్గకుండా అన్ని సాంకేతిక ప్రమాణాలు పాటిస్తున్నామని పేర్కొన్నారు.అమరావతిలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన నేపథ్యంలో రాజధాని అభివృద్ధి మరింత వేగవంతం కానుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు ఒకే ప్రాంతంలో పనిచేసే విధంగా అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తున్నామని తెలిపారు .వైసీపీ నాయకులు అమరావతి నిర్మాణాలపై ఆధారాలు లేని ఆరోపణలు చేయడం మానుకోవాలని మంత్రి హితవు పలికారు. ప్రజలకు వాస్తవాలు తెలుసునని, అభివృద్ధిని అడ్డుకునే విధంగా అసత్య ప్రచారాలు కొనసాగిస్తే ప్రజల నుంచి మరింత తిరస్కరణ ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. అమరావతి నిర్మాణం రాష్ట్ర భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశమని, ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

# కడప రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు మూసివేతపై విమర్శలు

- ప్రపంచ రక్తదాతల దినోత్సవ వేళ దాతల్లో అయోమయం
- అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆరోపణలు




**కడప మన జనప్రగతి జూన్ 13:-**ప్రపంచ రక్తదాతల దినోత్సవం (జూన్ 14) సందర్భంగా కడప రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు మూసివేత సర్వత్రా విమర్శలకు దారితీసింది. బ్లడ్ బ్యాంకు కార్యకలాపాలు నిలిచిపోవడంతో రక్తదాతలు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రక్తదాన కార్యక్రమాలు నిర్వహించాలా, వద్దా అనే సందిగ్ధంలో దాతలు ఉన్నట్లు తెలుస్తోంది.కడప జిల్లా కేంద్రంలో 1958 సెప్టెంబర్ 2న భారతీయ రెడ్‌క్రాస్ సంస్థ ప్రారంభమైంది. అనంతరం 2004 నవంబర్ 21న అప్పటి జిల్లా కలెక్టర్ జె.ఎస్. రంజన్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు ప్రారంభమైంది. అప్పటి నుంచి అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన రోగులకు, ముఖ్యంగా థలసేమియా బాధితులకు సేవలు అందిస్తూ వస్తోంది.అయితే బ్లడ్ బ్యాంకులో రక్త గ్రూపింగ్‌కు అవసరమైన ఆధునిక పరికరాలు, రక్త నిల్వకు తగిన సదుపాయాలు లేకపోవడంపై చాలా కాలంగా విమర్శలు ఉన్నాయి. 2023లో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి నిధుల నుంచి రూ.25 లక్షల వ్యయంతో అదనపు భవనం నిర్మించినప్పటికీ, దానిని ఇప్పటికీ వినియోగంలోకి తీసుకురాలేదని స్థానికులు పేర్కొంటున్నారు.బ్లడ్ బ్యాంకు నిర్వహణకు అవసరమైన లైసెన్సును ప్రతి ఏడాది పునరుద్ధరించుకోవాల్సి ఉండగా, గడువు ముగిసినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. లైసెన్సు గడువు ముగిసి రెండు నెలలు దాటడంతో బ్లడ్ బ్యాంకు కార్యకలాపాలు నిలిచిపోయినట్లు సమాచారం. బ్యాంకులో ఉన్న రక్త నిల్వలను కర్నూలు బ్లడ్ బ్యాంకుకు తరలించినట్లు తెలిసింది.ప్రస్తుతం రక్తదాతలు రక్తదానం చేసినా నిల్వ ఉంచే అవకాశం లేకపోవడంతో పాటు, అవసరమైన వారికి రక్తం అందించే పరిస్థితి కూడా లేదు. దీంతో బాధితులు ప్రైవేట్ బ్లడ్ బ్యాంకులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గత ఆరు సంవత్సరాలుగా రెడ్‌క్రాస్ సొసైటీకి పాలకవర్గాన్ని నియమించకపోవడం, అధికారుల పర్యవేక్షణ లోపించడం, సిబ్బంది నిర్లక్ష్యం వంటి కారణాల వల్లే ఈ పరిస్థితి నెలకొందని రక్తదాతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు విమర్శిస్తున్నారు.రాష్ట్రస్థాయి అధికారులు, రెడ్‌క్రాస్ ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని బ్లడ్ బ్యాంకు పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని, అవసరమైతే తాత్కాలిక అడ్‌హాక్ కమిటీని నియమించి సేవలను తిరిగి ప్రారంభించాలని రక్తదాతలు, మేధావులు, సామాజిక సంస్థల ప్రతినిధులు కోరుతున్నారు.

# ఏ. ఐ.బి.ఎస్.యూ ఆధ్వర్యంలో కువైట్ లోఘనంగా బ్లడ్ క్యాంపెయిన్



**కువైట్ మన జనప్రగతి జూన్ 13 :-** భారత రాయబార కార్యాలయం కువైట్ వారి ఆధ్వర్యంలో ప్రపంచ రక్త దాన దినోత్సవ సందర్భంగా శనివారం బ్లడ్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇండియన్ ఎంబసీ అంబాసిడర్ ప్రమిత త్రిపాఠి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయులు అంత ఒక వేదిక మీదకు వచ్చి రక్తదాన శిబిరంలో పాల్గొనీ రక్త దానం చెయ్యడం ఎంతో గర్వించ దగ్గ విషయం అన్నారు. అలాగే ఇండియా నుంచి ఉపాధి కొరకు కువైట్ వచ్చే భారతీయులు ఎవరైన సరే ఇండియన్ ఎంబసీ గుర్తించిన ఏజెంట్ ద్వారా మాత్రమే రావాలని ఆమె పిలుపును ఇచ్చారు. అలాగే మధ్యవర్తులు, దళారులను నమ్మి అరబ్ దేశాల్లో వెళ్ళి ఇబ్బందులకు గురి అవ్వకండి అంటూ తెలిపారు. అలాగే భారతీయుల ఎవరైనా కువైట్ లో ఇబ్బందులు పడుంటే వెంటనే భారతయా ఎంబసీ కార్యాలానికి తెలియజేయాలన్నారు. అనంతరం రక్తదాన శిబిరంలో పాల్గొన్న వారికి ఇండియన్ ఎంబసీ వారు ప్రశంస పత్రాలు అందించారు.ఇలాంటి కార్యక్రమాలు ఆల్ ఇండియా బంజారా సేవ సమితి ముందు ముందు ఎన్నో కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అలాగే కువైట్ లో ఉన్న బంజారా సోదరులకు ఏ ఆపద వచ్చినా ఆల్ ఇండియా బంజారా సేవా సమితి ఎల్లప్పుడు వాళ్లకి తోడుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం అవ్వడానికి కృషి చేసిన బంజారా సేవా సమితి కువైట్ అధ్యక్షులు వసంతరావు రాథోడ్, ఉపాధ్యక్షులు కృష్ణా నాయక్, రాజు, హిమ్మత్ చంద్ర, నౌసీలాల్ రవీందర్, శివరాం హరి అలాగే సింగ్మరియు కమిటీ ఇంచార్జీ బంజారా బుజ్జి బాయి, సోనాబాయ్ మరియు టీం సభ్యులు అభినందించారు.

# లక్కారం దళిత రైతులకు న్యాయం చేయాలి: మెట్టు శ్రీధర్



**పటాన్ చెరువు మన జనప్రగతి జూన్ 13:-** లక్డారం గ్రామ పరిధిలోని సర్వే నెం. 498లో ఉన్న 21 ఎకరాల 31 గుంటల అస్సైన్డ్ భూమిని దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న దళిత రైతులకు ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే న్యాయం చేయాలని నవభారత్ నిర్మాణ్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ డిమాండ్ చేశారు.శనివారం బాధిత రైతులతో కలిసి భూములను పరిశీలించిన ఆయన వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నాలుగు దశాబ్దాలుగా ఈ భూములపై ఆధారపడి జీవిస్తున్న పేద దళిత రైతుల కుటుంబాలు ప్రస్తుతం తీవ్ర ఆందోళనలో ఉన్నాయని అన్నారు.ప్రజాప్రయోజనాల కోసం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను ఎవరూ వ్యతిరేకించడం లేదని, అయితే వాటి అమలులో రైతుల హక్కులు, జీవనోపాధి దెబ్బతినకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఎస్టీపీ (సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) వంటి ప్రాజెక్టుల ఏర్పాటుతో భూములు కోల్పోయే రైతులకు చట్టబద్ధమైన పరిహారం, ప్రత్యామ్నాయ భూములు లేదా పునరావాసం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. దశాబ్దాలుగా సాగు చేస్తున్న రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, వారి సమస్యలపై ఉన్నత స్థాయి విచారణ చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతుల భవిష్యత్తు, వారి కుటుంబాల జీవన భద్రత దృష్ట్యా మానవతా దృక్పథంతో నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.రైతుల హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ యువజన సంఘాల సమితి, నవభారత్ నిర్మాణ్ యువసేన ఎల్లప్పుడూ పోరాటం చేస్తాయని, బాధిత రైతులకు అండగా నిలుస్తాయని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, కావలి వీరేశం , నాగరాజు, స్థానిక నాయకులు, బాధిత రైతులు, గ్రామ పెద్దలు, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# 113 సార్లు రక్తదానం చేసిన యోధుడు డాక్టర్ వేణుగోపాల్




**చిట్వేలి మన జన ప్రగతి జూన్ 13:-**మానవత్వాన్ని తట్టి లేపే ప్రతి క్రియ సమాజ హితాన్నే కోరుతుంది. ఒకరి ప్రాణాన్ని కాపాడే ప్రక్రియ రక్తదానం, ఒక కుటుంబాన్ని కాపాడడమే కాకుండా ఆ కుటుంబంలో చిరునవ్వులు పూయిస్తుంది. అంత ప్రాముఖ్యతను పొందిన రక్తాదాన ప్రక్రియను గత 33 సంవత్సరాలుగా అలుపెరగక అవిచ్చినంగా కొనసాగిస్తూ ఇప్పటికి 113 పర్యాయాలు రక్తదానం చేసిన డా. దొండ్లవాగు. వేణుగోపాల్ మన మధ్యే వున్నారు. తిరుపతి జిల్లా చిట్వేలి మండలానికి చెందిన డా. వేణుగోపాల్ తన తల్లికి శస్త్ర చికిత్స సమయంలో అవసరమైన రక్తం దొరకక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆ సమయంలో రక్త దానం అవసరాన్ని గుర్తించారు. తను పడిన ఇబ్బందులు మరొకరు పడకూడదని రక్తదానం చేయడం మొదలు పెట్టి ప్రతి 90 రోజులకోమారు ఇస్తూ ఇప్పటి వరకు 113 పర్యాయాలు రక్తదానం చేశారు..... చేస్తూనే వున్నారు. రక్తదానం గురించి అతని మాటల్లో వినాలంటే అది సామాజిక బాధ్యత అంటారు. నాగరికత చెందిన, అభివృద్ధి చెందిన నేటి సమాజంలో రక్తం దొరకక ప్రతి 2 నిమిషాలకు ఒకరు చనిపోవడం అనాగరికతకు నిదర్శనం అంటారు. రక్తదానం చేయడం ద్వారా కుల, మత, ప్రాంతీయ రహిత, అసమానతలు లేని సమాజాన్ని నిర్మించవచ్చు అని డా. వేణుగోపాల్ అంటారు. సామాజిక శాస్త్రవేత్తగా సమాజంలో రక్తదానం చేయడం పై అవగాహన కల్పిస్తూ గ్రామాల్లోని యువతను రక్తదాతలుగా మారుస్తున్నారు. తిరుపతి జిల్లాలోనే చిట్వేలి మండలం రక్తదాతల ఖిల్లాగ మారడం వెనుక అతని కఠోర సంకల్పం ఉంది. **చిట్వేలి కి కేంద్రమంత్రి రాక..**డా. వేణుగోపాల్ 100వ సారి రక్తదానం చేసే కార్యక్రమంలో అప్పటి కేంద్ర సోసియల్ జస్టిస్, ఎంపవర్మెంట్ మంత్రి నారాయణ స్వామి ప్రత్యేకంగా ఢిల్లీ నుంచి వచ్చి పాల్గొనడంఒక ప్రత్యేకం. రాష్ట్ర గవర్నర్ నుంచి ప్రశంసలు పొందడం, ఉమ్మడి జిల్లా కలెక్టర్, అన్నమయ్య జిల్లా కలెక్టర్ నుంచి పలుమార్లు స్వాతంత్ర దినోత్సవ, ఘనతంత్ర దినోత్సవాల సందర్భంగా పురస్కారాలు పొందారు. హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, విశాఖపట్నం, తిరుపతి లోని పలు స్వచ్ఛంద సంస్థలు డా. వేణుగోపాల్ రక్తదాన దీక్షను గుర్తించి సన్మానాలు చేశారు. వారి అన్నలు డా. చంద్రశేఖర్, శ్రీనివాస్ లు స్ఫూర్తి నింపారని, వారి ప్రోత్సహం, మార్గ నిర్దేశం ఈ ఆవిరామ రక్తదానం కార్యక్రమానికి కారణం అన్నారు. శ్రీమతి రేవతి, కుమార్తె ఆకాంక్ష, కుమారుడు వేదాంష్ లు కూడా రక్త దాతలే.**కుటుంబం రక్తదాతల నిలయం** డా. వేణుగోపాల్ కుటుంబం లో 14మంది అంతా రక్తదాతలే. తన అన్నయ్యలు డా చంద్ర శేఖర్, శ్రీనివాస్ స్ఫూర్తితో శ్రీమతి రేవతి తోడ్పాటుతో అవిచ్చిన్నంగా రక్తదానం చేస్తున్నారని అంటారు. ఒకే కుటుంబంలో 14 మంది క్రమం తప్పకుండా రక్తదానం చేయడం ఒక విశేషం. అమెరికా లోని ఎన్ఎటిఎస్ సంస్థ 2025 లో ఫ్లోరిడా, టాంప లో నిర్వహించిన వేడుకలకు ఆహ్వానించడం, భారతి విశ్వ విద్యాలయం డా. వేణుగోపాల్ 113 పర్యాయాలు రక్తదానం చేయడం, రక్తదాన స్ఫూర్తిని పెంచడాన్ని గుర్తించి గౌరవ డాక్టరేట్ ని ప్రధానం చేయడం, ఇస్రో సైంటిస్ట్ నంబీ నారాయణన్ ప్రత్యేకంగా అభినందించడం తనకు మరింత బాధ్యతను పెంచిందని ఈ రక్తదాన ఉద్యమాన్ని కొనసాగిస్తూనే ఉంటానని అంటారు డా.వేణుగోపాల్.

# కువైట్‌లో ఘనంగా నటసింహం బాలకృష్ణ జన్మదిన వేడుకలు

## ఎన్టీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో
## అభిమానుల సందడి..
## అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం



**పీలేరు మన జనప్రగతి జూన్ 12:-**ప్రముఖ సినీనటుడు,హిందూపురం ఎమ్మెల్యే, పద్మభూషణ్ పురస్కార గ్రహీత నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను కువైట్‌లో ఎన్టీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి బాలకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సభా ప్రాంగణం "జై బాలయ్య" నినాదాలతో మారుమ్రోగింది.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గల్ఫ్ కౌన్సిల్ సభ్యులు వెంకట్ కోదూరి, జనసేన కువైట్ అధ్యక్షులు యెర్రంశెట్టి హరి రాయల్, ప్రవాసాంధ్ర తెలుగుదేశం వ్యవస్థాపక అధ్యక్షులు ములకల సుబ్బారాయుడు హాజరై ప్రసంగించారు.వెంకట్ కోదూరి మాట్లాడుతూ బాలకృష్ణ సినీ రంగంతో పాటు సేవా కార్యక్రమాల్లోనూ విశేష గుర్తింపు పొందారని అన్నారు. బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ ద్వారా వేలాది మందికి వైద్య సేవలు అందించడం ఆయన మానవతా దృక్పథానికి నిదర్శనమని పేర్కొన్నారు.యెర్రంశెట్టి హరి రాయల్ మాట్లాడుతూ బాలకృష్ణ సామాజిక సేవా కార్యక్రమాలు యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ములకల సుబ్బారాయుడు మాట్లాడుతూ తెలుగు జాతి గర్వించే మహానటుడిగా, ప్రజల అభిమాన నాయకుడిగా బాలకృష్ణ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని అన్నారు.ఎన్టీఆర్ సేవా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ బాలకృష్ణ జన్మదిన వేడుకలను నిర్వహించడం ఆనందంగా ఉందని, ఆయన మరెన్నో సంవత్సరాలు ఆయురారోగ్యాలతో ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా కువైట్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తికి లోకేష్ యువసేన కువైట్ కమిటీ సభ్యులు రూ.25,000, మైనార్టీ నాయకుడు గోహర్ అలీ రూ.5,000 ఆర్థిక సహాయాన్ని ప్రకటించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ టీడీపీ కువైట్ కోశాధికారి మోహన్ రాచూరి, గవర్నరేట్ అధ్యక్షులు ముస్తాక్ ఖాన్, రెడ్డయ్య చౌదరి, రవి మలిశెట్టి, ఎన్టీఆర్ సేవా సమితి ఉపాధ్యక్షులు సి.ఆర్. రమేష్ నాయుడు, గుదే శంకర్, నేస్తం ఫౌండేషన్ అధ్యక్షులు నాగేష్, మైనార్టీ నాయకులు అర్షద్, తెలుగు యువత అధ్యక్షులు మురళీ దుగ్గినేని, లోకేష్ యువసేన కువైట్ అధ్యక్షులు శ్రీనివాసులు, జనసేన నాయకులు ప్రసాద్, మల్లిఖార్జున, శెట్టిపల్లి ప్రసాద్, మహిళా నాయకులు నారాయణమ్మ, దేవి చౌదరి, విజయ, సరోజ, శశి తదితరులు పాల్గొని బాలకృష్ణకు జన్మదిన శుభాకాం క్షలు తెలిపారు. అభిమానులు, ప్రవాస తెలుగు సంఘా ల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఆరోపణలు చేసే ముందు అద్దంలో చూసుకోండి

- అవినాష్ రెడ్డిపై మహబూబ్ బాషా విమర్శలు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 13:-** ఆరోపణలు చేసే ముందు తమ గతాన్ని ఒకసారి అద్దంలో చూసుకోవాలని రాష్ట్ర ఉర్దూ మరియు హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాషా వైఎస్సార్సీపీ నాయకులను, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. పులివెందులలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.2005 మున్సిపల్ ఎన్నికల సమయంలో వైఎస్సార్సీపీ వర్గీయులు ప్రత్యర్థుల ఇళ్లపై దాడులు చేయడంతో పాటు పోలీసుల ద్వారా వేధింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. సతీష్ రెడ్డిని అరెస్టు చేసి అవమానించిన ఘటనలను గుర్తు చేస్తూ గతాన్ని మరచిపోవద్దన్నారు.ముగ్గురాయి మైనింగ్‌పై చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని, చట్టబద్ధమైన లీజుల ఆధారంగానే మైనింగ్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. గతంలో మైనింగ్ కమిషన్లు ఎవరి ఇంటికి వెళ్లాయో ప్రజలకు తెలుసని పేర్కొంటూ అవినాష్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు.మట్కా, జూదం అంశాలపై మాట్లాడే నైతిక హక్కు వైఎస్సార్సీపీకి లేదని మహబూబ్ బాషా అన్నారు. గత ఐదేళ్లలో వైఎస్సార్సీపీ నాయకుల ఇళ్లలోనే మట్కా కేంద్రాలు నడిచాయని ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పులివెందులలో మట్కా కార్యకలాపాలకు అడ్డుకట్ట పడిందన్నారు.ఇసుక దోపిడీపై విమర్శలు చేసే ముందు గత పరిస్థితులను గుర్తు చేసుకోవాలని సూచించారు. వైఎస్సార్సీపీ పాలనలో ఇసుక రీచ్‌లలో సీరియల్ నంబర్లు లేని టిప్పర్లు తిరిగేవని, ఇసుక కొరత కారణంగా కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఇసుకను తక్కువ ధరలకు అందుబాటులోకి తీసుకువచ్చిందని చెప్పారు. ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లకు ఉపాధి కల్పించడంలో బీటెక్ రవి పాత్ర కీలకమని కొనియాడారు.చికెన్ వ్యాపారంలో గతంలో ఏకపక్ష ఆధిపత్యం కొనసాగిందని, టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పోటీ పెరగడంతో ధరలు తగ్గాయని పేర్కొన్నారు. బీటెక్ రవి కమిషన్లు తీసుకుని బతికే వ్యక్తి కాదని స్పష్టం చేశారు.పులివెందుల చరిత్రలో ఎక్కువ హత్యలు ఏ ప్రభుత్వ హయాంలో జరిగాయో ప్రజలకు తెలుసని వ్యాఖ్యానించిన మహబూబ్ బాషా, 2019 తర్వాత తమ ఇంటిపై దాడులు జరిగాయని, తన తమ్ముడిపై హత్యాయత్నం కూడా జరిగిందని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారని అన్నారు.టీడీపీకి పులివెందుల ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని పేర్కొన్న ఆయన, సూపర్ సిక్స్ హామీల అమలుపై వస్తున్న విమర్శలను ఖండించారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం, పెన్షన్ పెంపు వంటి పలు హామీలను ప్రభుత్వం అమలు చేసిందన్నారు.రైతులకు వైఎస్సార్సీపీ పాలనలో ఆశించిన స్థాయిలో మేలు జరగలేదని విమర్శించిన మహబూబ్ బాషా, పులివెందులకు తాగునీటి సరఫరా మెరుగుపడటంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్సీ సతీష్ రెడ్డి కృషి చేశారని తెలిపారు. గతంలో తాగునీటి పేరుతో ప్రజల నుంచి డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. ప్రస్తుతం వేసవి కాలంలో కూడా నీటి సమస్య లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడాన్ని ప్రజలు హర్షించరని పేర్కొన్న మహబూబ్ బాషా, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి ఖచ్చితంగా విజయం సాధిస్తారని, పులివెందులలో మార్పు కోసం ప్రజలు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా పంతం | అభివృద్ధి మా లక్ష్యం

14 - 06 - 2026

# పేదల సొంతింటి కలను సాకారం చేస్తాం

**రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి**

**హౌసింగ్ పథకంలో అక్రమాలపై విచారణ**

**ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డితో కలిసి.. బొల్లవరం హౌసింగ్ లేఅవుట్ పరిశీలన, లబ్ధిదారులతో ముఖాముఖి**





**ప్రొద్దుటూరు, మన జనప్రగతి జూన్ 13:–** పేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, గత ప్రభుత్వ హయాంలో హౌసింగ్ పథకంఅమలులో చోటుచేసుకున్న అక్రమాలు, అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టి అర్హులందరికీ న్యాయం చేస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. గురువారం ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని బొల్లవరం హౌసింగ్ లేఅవుట్‌ను ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డితో కలిసి సందర్శించిన మంత్రి అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... "పేదలకు సొంత ఇల్లు అనేది కేవలం నాలుగు గోడలు కాదు.. వారి జీవితానికి భద్రత, గౌరవం అన్నారు. ప్రొద్దుటూరులో ఒక్క అర్హుడూ ఇల్లు లేకుండా ఉండకూడదన్నదే మా సంకల్పం" అన్నారు. గతంలో హౌసింగ్ పథకం అమలులో అనేక అవకతవకలు జరిగాయని, లబ్ధిదారుల ఎంపిక, ప్లాట్ల కేటాయింపు, గృహ నిర్మాణాల నిర్వహణలో అక్రమాలు చోటుచేసుకున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. ముఖ్యంగా మెప్మా మహిళా సంఘాలకు సంబంధించిన నిధుల వినియోగంలో సుమారు రూ.48 కోట్ల మేర గోల్‌మాల్ జరిగినట్లు ఫిర్యాదులు అందాయని, వాటిపై సమగ్ర విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, పేదల కోసం కేటాయించిన నిధులను దుర్వినియోగం చేసిన వారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. "పేదల కోసం ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి సరైన లబ్ధిదారునికే చేరాలి. గతంలో ఎక్కడైనా అన్యాయం జరిగి ఉంటే దాన్ని సరిదిద్దడం మా బాధ్యత. అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం" అని మంత్రి పేర్కొన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో హౌసింగ్ కార్యక్రమం పురోగతిని వివరిస్తూ, రామేశ్వరం, బొల్లవరం, మీనాపురం లేఅవుట్లలో మొత్తం 4,82,481 సెంట్ల విస్తీర్ణంలో 23,068 ప్లాట్లు అభివృద్ధి చేసినట్లు తెలిపారు. వీటిలో ఇప్పటికే 19,924 ప్లాట్లు లబ్ధిదారులకు కేటాయించగా, మిగిలిన 3,144 ప్లాట్లను కూడా త్వరలో అర్హులైన పేదలకు అందజేస్తామని చెప్పారు. అలాగే నియోజకవర్గంలో ఇప్పటివరకు 15,043 ఇళ్లకు అనుమతులు మంజూరు చేశామని, అందులో పట్టణ ప్రాంతాల్లో 11,655 ఇళ్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3,388 ఇళ్లు ఉన్నాయని వెల్లడించారు. రామేశ్వరం లేఅవుట్‌లో 7,647 ప్లాట్లలో 6,712, బొల్లవరం లేఅవుట్‌లో 10,462 ప్లాట్లలో 9,373, మీనాపురం లేఅవుట్‌లో 4,959 ప్లాట్లలో 3,839 ప్లాట్లు ఇప్పటికే లబ్ధిదారులకు కేటాయించినట్లు తెలిపారు. బొల్లవరం లేఅవుట్‌లో గృహ నిర్మాణాలు పూర్తి చేసిన లబ్ధిదారులకు త్వరలోనే ఇళ్లను అందజేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లేఅవుట్లలో తాగునీరు, విద్యుత్, రహదారులు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గృహ నిర్మాణ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని పేర్కొన్న మంత్రి, ఇప్పటివరకు సుమారు 4.50 లక్షల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మరో 4 లక్షల ఇళ్లను కూడా పూర్తి చేసి లబ్ధిదారుల చేతికి తాళాలు అందజేస్తామని వెల్లడించారు. "ప్రతి పేద కుటుంబం గౌరవంగా జీవించేందుకు సొంత ఇల్లు అత్యంత అవసరం. పేదల సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం. ఇంటి స్థలం నుంచి గృహ నిర్మాణం వరకు అన్ని దశల్లో ప్రభుత్వం అండగా ఉంటుంది. ప్రొద్దుటూరు నియోజకవర్గాన్ని గృహరహిత కుటుంబాలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం" అని మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ... ప్రొద్దుటూరులో ఒక్క అర్హుడూ ఇల్లు లేకుండా ఉండకూడదన్నదే మా సంకల్పం" అన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో హౌసింగ్ లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, వాటి పరిష్కారానికి మంత్రి పార్థసారథి ప్రత్యేక చొరవ చూపడం అభినందనీయమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో హౌసింగ్ పథకం అమలులో అనేక లోపాలు, అక్రమాలు చోటుచేసుకోవడంతో వేలాది మంది పేదలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించకపోవడం, నిర్మాణాలు మధ్యలో నిలిచిపోవడం, మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వంటి సమస్యలు ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెట్టాయని చెప్పారు. బొల్లవరం హౌసింగ్ లేఅవుట్‌లో అనేక ఇళ్లు అసంపూర్తిగా ఉండటంతో లబ్ధిదారులు ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిలిచిపోయిన గృహ నిర్మాణాలను తిరిగి గాడిలో పెట్టేందుకు చర్యలు ప్రారంభించిందన్నారు. నిర్మాణాలు పూర్తిచేసే లబ్ధిదారులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని రామేశ్వరం, బొల్లవరం, మీనాపురం లేఅవుట్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, అంతర్గత రహదారులు వంటి మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. హౌసింగ్ పథకానికి సంబంధించిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి అర్హులైన వారికి న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మెప్మా మహిళా సంఘాల నిధుల దుర్వినియోగంపై వచ్చిన ఆరోపణలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని, విచారణలో వాస్తవాలు బయటపడితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్డీఓ శిరీష, హౌసింగ్ సీఈ వేణుగోపాల్, జిల్లా హౌసింగ్ పీడి రాజారత్నం, తహశీల్దార్ ఉదయ భాస్కర్, హౌసింగ్ డీఈలు సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# హౌసింగ్ అక్రమాలపై ఉక్కుపాదం

**హౌసింగ్ శాఖ సమీక్ష సమావేశంలో అధికారులకు**

**మంత్రి పార్థసారథి సీరియస్ వార్నింగ్**

**సెప్టెంబర్ నాటికి పెండింగ్ ఇళ్లు పూర్తి చేయాలి**

**స్వాహా చేసిన నిధుల రికవరీకి చర్యలు**



**ప్రొద్దుటూరు,మన జనప్రగతి జూన్ 13:–** గతంలో హౌసింగ్ శాఖలో జరిగిన అవకతవకలు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా వేలాది మంది పేద లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మండిపడ్డారు. శనివారం మధ్యాహ్నం ప్రొద్దుటూరు ఆర్&బి అతిథి గృహంలో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి.. స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డితో కలిసి జిల్లా హౌసింగ్, రెవెన్యూ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో.. హౌసింగ్ లేఅవుట్లలో గృహ నిర్మాణాల పురోగతి, పెండింగ్ పనులు, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా సమీక్షించిన మంత్రి, గతంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సహించబోమని స్పష్టం చేశారు. "గత ప్రభుత్వ హయాంలో కొంతమంది అధికారులు, సిబ్బంది చేసిన నిర్వాకం వల్ల పేదలు నష్టపోయారని.. పేదల కోసం కేటాయించిన నిధులు దుర్వినియోగం అయ్యాయనే ఆరోపణలు వస్తున్నాయి. జరిగిన ప్రతి అక్రమంపై విచారణ జరిపి స్వాహా చేసిన కోట్ల రూపాయలను తిరిగి రికవరీ చేయాలని మంత్రి ఆదేశించారు. మెప్మా మహిళా సంఘాలు, హౌసింగ్ నిర్మాణాలకు సంబంధించిన నిధుల వినియోగంపై వచ్చిన ఫిర్యాదులను ప్రస్తావిస్తూ, ప్రజాధనం దుర్వినియోగం చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమన్నారు. బాధ్యులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని బొల్లవరం, రామేశ్వరం, మీనాపురం హౌసింగ్ లేఅవుట్లలో ఇంకా అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రానున్న సెప్టెంబర్అక్టోబర్ నాటికి పెండింగ్ గృహాలన్నీ పూర్తి చేసి లబ్ధిదారులు కాలనీల్లో నివాసం ఉండేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, "ప్రభుత్వం జీతాలు ఇస్తోంది ప్రజలకు సేవ చేయడానికి.. ఫైళ్లను పెండింగ్‌లో పెట్టడానికి కాదు. ఇకపై నిర్లక్ష్యం, అలసత్వం అస్సలు సహించం. లక్ష్యాలు చేరుకోలేకపోతే ఉద్యోగాలు వదిలి ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితులు తెచ్చుకోవాల్సి వస్తుందని ఘాటుగా హెచ్చరించారు. పేదల సొంతింటి కలను నెరవేర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న మంత్రి, రాష్ట్రవ్యాప్తంగా గృహ నిర్మాణ కార్యక్రమాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని తెలిపారు. ప్రతి అర్హ లబ్ధిదారుడు తన ఇంటిలో నివసించే వరకు ప్రభుత్వం వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు. సమావేశంలో ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ, ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని హౌసింగ్ లబ్ధిదారుల సమస్యలను ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుందని, పెండింగ్ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించి పేదలకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గతంలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జమ్మలమడుగు ఆర్డీఓ శిరీష, హౌసింగ్ సీఈ వేణుగోపాల్, జిల్లా హౌసింగ్ పీడి రాజారత్నం, తహశీల్దార్ ఉదయ భాస్కర్, హౌసింగ్ డీఈలు సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

**● మంత్రి పార్థసారథికి వినతిపత్రం అందజేసిన ప్రొద్దుటూరు ప్రెస్ క్లబ్ సభ్యులు**



**ప్రొద్దుటూరు,మన జనప్రగతి జూన్ 13:–** ప్రొద్దుటూరు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. శనివారం ప్రొద్దుటూరు పర్యటనకు విచ్చేసిన మంత్రికి ఆర్&బి అతిథి గృహంలో.. జర్నలిస్టులు వారి సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు. జర్నలిస్టులకు సామాజిక భద్రత కల్పించడంతో పాటు అర్హులైన పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ప్రెస్ క్లబ్ ప్రతినిధులు కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి, జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## పాపిరెడ్డి కాలనీలో బీఆర్ఎస్ పార్టీలోకి మహిళల భారీ చేరిక



**శేరిలింగంపల్లి మన జనప్రగతి జూన్ 13:–**పాపిరెడ్డి కాలనీ రాజీవ్ గృహకల్ప కాలనీ లో బీఆర్ఎస్ పార్టీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతోంది. బీఆర్ఎస్ నాయకులు మరబోయిన రవి యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్ నాయకులు చందు నాయక్ మరియు సాయి నందన్ ముదిరాజ్ నాయకత్వంలో, పెద్ద సంఖ్యలో మహిళలు, స్థానిక ప్రజలు బీఆర్ఎస్ పార్టీలో కి అధికారికంగా చేరారు. మరబోయిన రవి యాదవ్ కొత్తగా పార్టీలో చేరిన వారికి బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మారబోయిన రవి యాదవ్ మాట్లాడుతూ..."మహిళల సంక్షేమం పేరుతో పెద్ద పెద్ద హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలను పూర్తిగా నిరాశపరిచింది. ఉచిత బస్సు ప్రయాణం పేరుతో ప్రచారం చేసుకుంటూ, మరోవైపు పెరిగిన ఛార్జీల భారం ద్వారా ప్రజల జేబులకు గండి కొడుతోంది" అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, స్థానిక నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, యువజన నాయకులు మరియు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# టీడీపీ డైవర్షన్ రాజకీయాలు మానుకోవాలి: మాజీ మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్

**పులివెందుల, అర్బన్ మన జనప్రగతి జూన్ 13:–** శుక్రవారం నిర్వహించిన ర్యాలీ భారీ విజయవంతం కావడంతో టీడీపీ నాయకులు దిక్కుతోచక నిరాధార ఆరోపణలు చేస్తూ డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని మాజీ మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్ విమర్శించారు. పులివెందుల ప్రాంతాన్ని ప్రజల అండతో అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఘనత వైఎస్ కుటుంబానిదేనని, ప్రస్తుతం అధికార మదంతో టీడీపీ నాయకులు ప్రజల ప్రయోజనాలను విస్మరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి నిజాయితీ కలిగిన నాయకుడని, తమపై చేస్తున్న ఆరోపణల విషయంలో ప్రమాణానికి సిద్ధమని సవాలు విసిరినా టీడీపీ నాయకుల నుంచి ఇప్పటివరకు స్పందన రాలేదన్నారు. మెడికల్ కాలేజీ నిర్మాణానికి అవసరమైన నాణ్యమైన కంకరను ఇంజినీర్ల సూచనల మేరకే చక్రాయపేట మండలంలోని స్టేజ్–3 క్రషర్ యూనిట్ నుంచి తీసుకున్నామని, వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు. గతంలో టీడీపీ నాయకులే చక్రాయపేట ప్రాంతంలో దాడులు, వివాదాలకు కారణమయ్యారని ఆరోపించిన వరప్రసాద్, రాజకీయ విమర్శలు చేసేటప్పుడు పరిపక్వతతో వ్యవహరించాలని హితవు పలికారు. శుక్రవారం జరిగిన ర్యాలీలో సుమారు 9 వేల మంది పాల్గొనడం ప్రజల్లో వైఎస్సార్‌సీపీకి ఉన్న ఆదరణకు నిదర్శనమన్నారు. పులివెందుల మున్సిపాలిటీలో అధికారుల కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అనేక సమస్యలు ఇంకా పరిష్కారానికి నోచుకోవడం లేదని పేర్కొన్నారు. ఎంపీ అవినాష్ రెడ్డి తన సొంత నిధులు, ఎంపీ నిధులతో అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నారని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ హయాంలో మున్సిపాలిటీకి రెండు సార్లు అవార్డులు వచ్చాయని, ప్రస్తుతం మున్సిపాలిటీ దిక్కుతోచని పరిస్థితిలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు కోడి రమణ మాట్లాడుతూ ఇసుక రీచ్‌ల నిర్వహణపై టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు నిరాధారమని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి సహా అన్ని హామీలను ప్రభుత్వం పూర్తిగా అమలు చేసే వరకు ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, వైస్ ఛైర్మన్ హఫీజుల్లా, సీనియర్ నాయకుడు కోడి రమణ, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్‌లు పాల్గొన్నారు.



## కష్టాల్లో ఉన్న పేదలకు సీఎం సహాయ నిధి అండ

**- రూ.20.13 లక్షల విలువైన 21 చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి**



**పీలేరు మన జనప్రగతి జూన్ 13:–**ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం కలికిరి నగిరిపల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన 21 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. మొత్తం 21 చెక్కులకు గాను రూ.20,13,365 విలువైన ఆర్థిక సహాయాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యం, ప్రమాదాలు తదితర కారణాలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయుక్తంగా మారిందన్నారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నల్లారి అభిమానులు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174